విశాలాంధ్ర కృష్ణా జిల్లా

సంక్షేమ పథకాలే జగనన్నకు అండ

– ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

విశాలాంధ్ర - అవనిగడ్డ : రాష్ట్రంలో అందిస్తున్న సంక్షేమ పథకాలే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలుస్తాయని శాసనసభ్యులు సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. శనివారం మండల పరిధిలోని మోదుమూడి సచివాలయ పరిధిలో గడపగడపకి మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించి ఇంటింటికి వెళ్ళి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను అందుతున్న పథకాలను వివరించారు. జనవరి నెల నుండి అర్హులైన ఫించన్ దారులకు 3 వేల రూపాయలు అందించే విధంగా జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకున్నారన్నారు. రాష్ట్రంలోని పేదలను దృష్టిలో పెట్టుకుని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలను దేశం మొత్తం చూస్తుందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా వైద్యానికి, విద్యకు పెద్ద పీఠ వేస్తూ, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలను ఏర్పాటు చేసి పేదవారి ఇంటి ముంగిటకే కార్పోరేట్ వైద్యం అందిస్తున్నారని, వైద్యంతో పాటు ఉచితంగా మందులు కూడా అందిస్తున్నారన్నారు. అమ్మవడి వంటి బహోత్తరమైన కార్యక్రమాలతో నిరుపేదలు సైతం కార్పోరేట్ విద్యను అందిస్తున్న ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. రానున్న ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని ప్రతి ఒక్కరూ ఆశీర్వదించాలని ఎం.ఎల్.ఎ కోరారు. ఈ కార్యక్రమంలో ఎం.పి.పి తుంగల సుమతీ, జడ్.పి.టి.సి చింతలపూడి లక్ష్మీనారాయణ, గ్రామ పార్టీ అధ్యక్షులు గాజుల వరదరాజులతో పాటు ఆ పార్టీ నేతలు, అభిమానులు పాల్గొన్నారు.

పంట కాలువలో ఇద్దరు విద్యార్థుల గల్లంతు

విశాలాంధ్ర - అవనిగడ్డ : పులిగడ్డ, అవనిగడ్డ ప్రధాన పంట కాలువలో ఇద్దరు విద్యార్థులు గల్లంతైన సంఘటన శనివారం చోటు చేసుకుంది. ఉదయం సీతాయలంకలోని అంబేద్కర్ విగ్రహం ఎదురుగా ఉన్న పంట కాలువలో సింహాద్రి కాలనీకి చెందిన ఆవుల సిద్ధార్థ (12), 7వ తరగతి, వల్లాల బాలయ్య (14) 8వ తరగతి. వీరి ఇరువురితో పాటు వల్లమాల నాగచైతన్య(12) 7వ తరగతి, టమటం సంతోషం (15) 10వ తరగతి చదివే విద్యార్థులు స్నానం చేసేందుకు కాలువలో దిగి స్నానం చేస్తుండగా నీటి ప్రవాహానికి ఆవుల సిద్ధార్థ, వల్లాల బాలయ్యలు గల్లంతయ్యారు. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. అవనిగడ్డ సి.ఐ, ఎస్.ఐ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కాలువలో దిగిన ప్రదేశానికి సుమారు 400 మీటర్ల దూరంలో ఆవుల సిద్ధార్థ మృత దేహం లభ్యంకాగా, వల్లాల బాలయ్య కోసం గాలింపు చర్యలు జరుగుతున్నాయి. సిద్ధార్థ మృత దేహాన్ని ప్రభుత్వ వైద్యశాలలో శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు, జడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీ నారాయణలు సందర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. అనంతరం ఉన్నత అధికారులను, ఫైర్ సిబ్బందిని అప్రమత్తం చేసి గాలింపు చర్యలు ముమ్మరం చేయాలని సూచించారు. ఈ గాలింపు చర్యలలో జనసేన మండల పార్టీ అధ్యక్షులు గుడివాక శేషుబాబు గాలింపు చర్యలకు కావలసిన వాటిని సమకూర్చుతూ అక్కడే ఉండి సేవలందిస్తున్నారు. వీరితో పాటు రెవెన్యూ వి.ఆర్.ఓ కూడా సేవలందిస్తున్నారు. ఈ సంఘటనకు సింహాద్రి కాలనీలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

సర్వాంగ సుందరంగా ముస్తాబైన ‘కూచిపూడి’

విశాలాంధ్ర-కూచిపూడి : నాల్గవ ప్రపంచ కూచిపూడి నాట్య దినోత్సవం-2023 కూచిపూడి సర్వాంగ సుందరంగా ముస్తాబయింది. నాట్య క్షేత్రమైన కూచిపూడిలో మరొక నాలుగైదు గంటలలో ప్రారంభమయ్యే నాల్గవ ప్రపంచ కూచిపూడి నాట్య దినోత్సవం-2023 సందర్భంగా నిర్వహించే పద్మభూషణ్ డాక్టర్ వెంపటి చినసత్యం జయంతి వేడుకలకు కృష్ణా జిల్లా కలెక్టర్ బి.రాజబాబు ఆదేశాలతో జిల్లా, మండల, గ్రామ స్థాయి అధికారులు సర్వాంగ సుందరంగా రూపుదిద్దారు. రాష్ట్ర ప్రభుత్వం పర్యవేక్షణలో ఆయన స్వస్థలమైన కూచిపూడిలో తొలిసారిగా నిర్వహించే ఈ వేడుకలకు ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంది. దీనిలో భాగంగానే పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రాంగణంలో నిర్వహించే ఈ వేడుకలు కోసం గత రెండు రోజులుగా వివిధ శాఖల అధికారులు అధిక శ్రమల కోర్చి ఆరుబయట రంగస్థలాన్ని, కళాపీఠం ప్రాంగణంలో పాటు వెంపటి చినసత్యం ఇంటి ప్రాంగణాన్ని సైతం నయనానందకరంగా రూపొందించారు. కూచిపూడి గ్రామ పంచాయతీ సర్పంచ్ కొండవీటి వెంకటరమణ విజయలక్ష్మి ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని తన భర్త అమర బాలేశ్వరరావు సహకారంతో కార్యదర్శి భవాని తోపాటు మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ అధికారులు పర్యవేక్షణలో పరిశుభ్రమైన వాతావరణంలో కార్యక్రమం జరిగేలా పారిశుద్ధ్య పనులను నిర్వహించారు. ఈ వేడుకలలో పాల్గొనడానికి రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి రోజా, గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేశ్, పామర్రు శాసనసభ్యులు అనిల్‌తో పాటు రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులు పాల్గొంటారు. కాగా చినసత్యం జీవిత సాఫల్య పురస్కారాన్ని కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత మంజుభార్గవికి ప్రభుత్వం అందించనున్నది. అలాగే సేవ్ కూచిపూడి ఆర్టిస్ట్స్ వ్యవస్థాపకురాలు భావన పెద ప్రోలు ఏటామాదిరిగానే ఈ ఏడాది పద్మభూషణ్ డాక్టర్ వెంపటి చినసత్యం అవార్డును కలైమామణి మాధవపెద్ది మూర్తికి, పద్మశ్రీ డాక్టర్ శోభానాయుడు అవార్డును కళా రత్న డాక్టర్ వేదాంతం రాథేశ్యాంకు, సిద్ధేంద్ర యోగి అవార్డును డాక్టర్ వేదాంతం రామలింగ శాస్త్రికి, లంక అన్నపూర్ణ అవార్డును పార్వతి రామచంద్రన్‌కు, వెంపటి వెంకట అవార్డును పఠాన్ మొహిద్దీన్ ఖాన్‌లకు అందించనున్నారు. బృంద, మహా బృంద నాట్యాలలో పాల్గొనటానికి శనివారం సాయంత్రం వరకు 850 మందికి పైగా కళాకారులు తమ పేర్లు నమోదు చేసుకున్నట్టు నిర్వాహకులు వెల్లడించారు.

నర్సప్ప చెరువులో టీడీపీకి బ్రహ్మరథం

విశాలాంధ్ర - పెడన: పెడల మండలం నర్సప్ప చెరువు గ్రామంలో తెలుగుదేశం పార్టీ నిర్వహించిన బాబుతో నేను కార్యక్రమానికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ఈ మేరకు శనివారం సాయంత్రం నియోజక వర్గ ఇన్చార్జి కాగిత.కృష్ణ ప్రసాద్ ఆధ్వర్యంలో టిడిపి నాయకులు ఆ గ్రామంలో పర్యటించారు. చంద్రబాబును అరెస్టులో నిరసిస్తూ గ్రామంలో ఇంటింటికి తిరిగి కరపత్రి కలు పంపిణీ చేస్తూ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులతో పాటు జనసేన నాయకులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నా రు. జడ్పిటిసి అర్జా వెంకట నగేష్ శలపాటి వీరప్రసాద్, శీరం ప్రసాద్,ఇల్లూరి లీలా కృష్ణ,కట్టా సతీష్,చింతల వెంకటరత్నం, చెన్నూరు శేఖర్ గంధం గోపాలకృష్ణ బొర్రా కాశి పాల్గొన్నారు.

చంద్రబాబు నాయుడుపై అక్రమ కేసులను ఎత్తివేయాలి

విశాలాంధ్ర - అవనిగడ్డ : చంద్రబాబు నాయుడుపై అక్రమ కేసులను ఎత్తివేసి వెంటనే విడుదల చేయాలి. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుపై అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేసి 36 రోజులు కావడంతో ఆయన ఆరోగ్య పరిస్థితుల దృష్ట్యా సర్వత్రా ఉత్కంఠ నెలకొందని వెంటనే చంద్రబాబు నాయుడుపై పెట్టిన కేసులను ఎత్తివేసి విడుదల చేయాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర పి.ఎన్.టి.యు.సి కార్యనిర్వాహక కార్యదర్శి అన్నారు. శనివారం ఆలయన పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబుకు గత కొన్ని సంవత్సరాలుగా ఆరోగ్య పరిస్థితులు బాగుండటంలేదని అక్రమ కేసులు పెట్టి వేదిస్తున్నారని, ఉభయ తెలుగు రాష్ట్రానికి 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా అనేక సేవలు అందించిన వ్యక్తి చంద్రబాబు నాయుడు అని అటువంటి వ్యక్తి కనీస సౌకర్యాలు లేకుండా ఏ.సి., కూలర్ కూడా లేకుండా సాధారణ ఖైదిలాగా జైలులో అధికారులు చూడడం విడ్డూరంగా ఉందన్నారు. చంద్రబాబు ఆరోగ్యం దృష్టిలో పెట్టుకుని సూపర్ స్పెషాలిటీ వైద్యశాలలో వైద్యం చేయించడం కానీ, ఎయిమ్స్ ఆసుపత్రిలో కానీ వైద్యం చేయించాలన్నారు. చంద్రబాబు ఆరోగ్య పరిస్థితుల గురించి వైద్యులకే ప్రతి రోజు బులిటెన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మండల పార్టీ అధ్యక్షులు యాసం చిట్టిబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆటో వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు దాసి దేవదర్శనం, మాజీ జడ్.పి.టి.సి కొల్లూరి వెంకటేశ్వరరావు, జిల్లా ఎస్.సి సెల్ నాయకులు ఎం. ఆదినారాయణ, కర్రా సుధాకర్, ఆ పార్టీ సీనియర్ నేతలు మోగావత్తు గోపి, మండలి రాంమోహన్‌రావు, చెన్ను గాంధీ, పులిగడ్డ నాంచారయ్యలతో పాటు పలువురు పాల్గొన్నారు.

సఫాయి కర్మఛారిస్‌య సంఘం జిల్లా కార్యదర్శిగా మాడుగుల రేణుశివకుమార్

విశాలాంధ్ర - గుడివాడ : సఫాయి కర్మఛారిస్‌య సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా మాడుగుల రేణు శివకుమార్‌ను జాతీయ అధ్యక్షుడు వీర్రాజు ఆధ్వర్యంలో విజయవాడలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఏకగ్రీవంగా ఎనుకున్నట్లు రేణు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రొగ్రెసివ్ సఫాయి కర్మఛారిస్‌య సమావేశంలో జిల్లా సహాయకార్యదర్శిగా, పట్టణ అధ్యక్షుడిగా వడ్డాది శ్రీనివాసరావు, పట్టణ ప్రధాన కార్యదర్శిగా ముత్యాల రాజేష్‌కుమార్‌ను సభ్యులు నిమించడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు సంఘం సభ్యులుగా ఎన్నుకున్న శివకుమార్, శ్రీనివాసరావు, రాజేష్‌లను పలువురు అభినందిచారు.

అక్రమంగా చంద్రబాబు అరెస్టు : మాజీ ఎమ్మెల్యే రావి

విశాలాంధ్ర - గుడివాడ : టిడిపి రాష్ట్రపార్టీ అదేశాల మేరకు శనివారం టిడిపి అధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే రావి వెకంటేశ్వరావు నేతృతంలో చంద్రబాబు అక్రమంగా ఏవిధంగా అరెస్టు చేసింది వార్డు ప్రజలకు తెలిపారు. స్థానిక 16వ వార్డు ద్రోణాదులవారి వీధిలో రచ్చబండ కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు నిర్వహించి వార్డు ప్రజలకు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబును ఏవిధంగా అక్రమ అరెస్ట్ చేశారు తెలిపారు. ప్రజలు ఇప్పటికైె సైకో జగన్ పాలనకు చర్మగీతం పాడలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు దింట్యాల రాంబాబు, క్లస్టర్ 5 ఇంచార్జ్ ముళ్ళపూడి రమేష్, యూనిట్ ఇంచార్జ్ యార్లగడ్డ సుధారాణి, వార్డు ఇంచార్జ్ తమ్మిశెట్టి కనకారావు, బూత్ ఇంచార్జ్‌లు అచ్చి శ్రీనివాస్, ద్రోణాధుల కుమార్, పెద్ది శ్రీనివాసరావు, కనకారావు, వార్డు సభ్యులు బాబ్జి, కొండ భాస్కర్, సత్యనారాయణ, దీపిక, చిన్నమ్మ, వెంకటేశ్వరమ్మ పాల్గొన్నారు.

100 ఎకారల గడ్డివాము దగ్ధం

విశాలాంధ్ర - గుడివాడ : కోతులు బేదద నుండి పంటను కాపాడుకునేందుకు రూరల్ మండలంలోని రామనపూడి శివారులో ఓ రైతు తాటిచెట్టుకు నిప్పుపెట్టాడంతో గోవుల ట్రస్ట్‌కు చెందిన 100 ఎకారల గడ్డివాములు దగ్దం అయిన సంఘటన రామనపూడిలో చోటు చేసుకుంది, శనివారం గోసేవా ట్రస్టు చైర్మన్ వావిలాల ఉమాపతి, పిన్నమనేని చంటిబాబు, జోస్యుల కళ్యాణ్, వాసు, ఎం.మాధవరావు, డి.ప్రసాద్‌లు తెలిపిన వివారల ప్రకారం కోతులను తరమడానికి గుడివాడ మండలం రామనపూడి శివారులో ఓ రైతు తాటి చెట్లుకు నిప్పుపెట్టారన్నారు. ఆ మంటలు గాలికి ఎగిసిపడి పక్కనే ఉన్న శ్రీ కామాక్షి ఏకామ్రేశ్వర గోమాత సేవక సత్సంగ్ ట్రస్ట్‌కు చెందిన సుమారు వంద ఎకరాల భారీ గడ్డి వాములు తగలబడి లక్షల విలువైన పశుగ్రాసం మంటలపాలైందన్నారు. 300 ఆవులతో గోశాల నదుస్తోందన్నారు. సంఘటన తెలుసుకున్న ఫైర్ సిబ్బంది శ్రమించి మంటలను అదుపులోకి తీసుకురావడం జరిగిందన్నారు. ఫైర్ సిబ్బంది మంటలు వ్యాపించకుండా నిరోధించడంతో భారీ అగ్నిప్రమాదం, ఆస్తి నష్టం తప్పిందన్నారు.

అన్ని దానాల్లో అన్నదానం గొప్పది

విశాలాంధ్ర - గుడివాడ : ఏలూరురోడ్‌లో గల కోర్టు సముదాయం వద్ద జరిగిన శ్రీవిఘ్నేశ్వరస్వామి వారి నవరాత్ర మహోత్సవాల్లో అత్యంత వైభంగా నిర్వహించిన బార్ అసోసియేసన్ సభ్యులు శనివారం స్థానిక ఆర్‌డివో కార్యాలయం రోడ్డులోని పాత కోర్టు భవణం వద్ద భారీ అన్నదాన సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ అన్నసమారాధనను న్యాయమూర్తులు జి.సుబ్రమణ్యం, కె.నాగలక్ష్మీలు ప్రారంభించారు. తొలుత స్వామి వారికి నాయకులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేసన్ అధ్యక్షా, కార్యదర్శులు తుమల్లచర్ల శ్రీనివాసరావు, సిహెచ్ వెంకటరమణ, ఉపాధ్యక్షుడు చోరగుడి కుటుంబరావు, సీనియర్ నాయ్యవాదులు కొడాలి హరినాథ్, మురళీ, రఫీ, కె.వి రామరావు, గౌరి రాంబాబు, యార్లగడ్డ అంకినీడు, ప్రసాద్, న్యాయవాదులు, న్యాయవాద గుమస్తాలు, తదితరులు పాల్గొన్నారు.

దసరా నవరాత్రులు ప్రారంభం

విశాలాంధ్ర - పెదపారుపూడి : మండలంలో దసరా నవరాత్రులు ప్రారంభమయ్యాయి అని మండల దేవాలయాల మేనేజర్ వి.దుర్గాధనప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ యలమర్రు రామేశ్వర స్వామి, వేణు గోపాలస్వామి, వెంట్రప్రగడ నామేశ్వర స్వామి దేవాలయాలలో తొమ్మిది రోజులు పాటు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేయనున్నట్లు ఆయన వివరించారు. దోసపాడు గ్రామంలో కాళికాదేవి ఆలయంలో ఆలయ బాధ్యులు సజ్జ శివకుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

దసరా సెలవులకు ఉరెళ్తున్నారా..జాగ్రత్త

విశాలాంధ్ర- కంచికచర్ల : కంచికచర్ల సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ సుబ్రమణ్యం దసరా పండుగకు సొంత గ్రామాలకు వెళ్లేవారు తమ ఇళ్లల్లో ఉన్న బంగారు, వెండి, నగదు బ్యాంకు లాకర్లలో భద్రపరుచు కోవాలని సూచించారు. ఊరికి వెళితే పోలీసుస్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని అన్నారు. దొంగతనాలు జరగకుండా ప్రత్యేక నిఘా ఉంచు తామని అన్నారు. ఇళ్ల వద్ద తాళాలు వేసి ఉండడం చూసి ఇదే అదునుగా చూసుకొని అల్లరి మూకలు దొంగ తనాలు చేసే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని మాకు తెలియ జేసినట్లయితే తాళాలు వేసి ఉన్న ఇంటిపై నిఘా ఉంచుతామని ఆయన తెలియ జేశారు. వాహనాల్లో వెళ్లేవారు ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ నిదానంగా వెళ్లాలని మీ తొందరపాటు వేరొకరి ప్రాణాలను హరిస్తుందని గుర్తుంచు కోవాలన్నారు.

ఏ వార్త అయినా మానవ జీవితానికి శుభవార్త అవ్వాలి

విశాలాంధ్ర - పెదపారుపూడి : ఏ వార్త అయినా మానవ జీవితానికి సువార్త శుభవార్తగా మారాలని సబిత గాస్పల్ అండ్ సోషల్ మినిస్ట్రీస్ అధినేత కొక్కిలిగడ్డ షాలెం రాజు శనివారం ఒక ప్రకటనలో అన్నారు. మండలంలోని వెంట్రప్రగడ ఆలయంలో ఆయన మాట్లాడుతూ కాలం సంపూర్ణమైనప్పుడు దేవుని రాజ్యం సమీపింపబడినదని అన్నారు. వార్తలు అనేకం ఉన్నప్పుడు వాటిలో (గుడ్ న్యూస్) మంచి వార్తలు, (బ్యాడ్ న్యూస్) చెడు వార్తలు ఉంటాయని అన్నారు. ప్రతి మానవుడు జీవించ టానికి కావలసిన మంచి వార్తలు బైబిల్ సువార్త గ్రంథములో శుభవార్తగా ప్రజలకు అందిస్తుందని ఆయన ఉద్బోధించారు. ఈ కార్యక్రమంలో ఎస్ కే మోషే, వి పాల్, టి జ్యోతి, వై రూతమ్మ, పి జీవమణి, జె సునీత, పి నిర్మల పాల్గొన్నారు.

చంద్రబాబునాయుడుకు మెరుగైన వైద్యం అందించాలి

విశాలాంధ్ర - నాగాయలంక : ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును కార్పొరేట్ ఆసుపత్రిలో చేర్పించి మెరుగైన చికిత్సను అందించాలని ఆంధ్రప్రదేశ్ సాంప్రదాయ మత్స్యకారుల సేవా సంఘం ప్రధాన కార్యదర్శి లకనం నాగాంజనేయులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం నాగాయలంకలోని ఫిష్ ల్యాండింగ్ సెంటర్‌ని పరిశీలించిన అనంతరం మత్స్య భవనం వద్ద విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ఆరోగ్యం పట్ల ప్రజలలో ఆందోళనలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం తక్షణం చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో మత్స్యకార సంఘాల నాయకులు నాగిడి తాతారావు, కర్రి కృష్ణమూర్తి, లంకే శ్రీనివాస ప్రసాద్ పాల్గొన్నారు.

చల్లపల్లిలో ‘బాబుతో నేను’

విశాలాంధ్ర - చల్లపల్లి : టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుపై అక్రమ కేసులు బనాయించి అరెస్టు సిన వైనాన్ని ప్రజలకు తెలియచేసేలా చేపట్టిన “బాబుతో నేను” కార్యక్రమం చల్లపల్లి మండల తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం చల్లపల్లిలో జరిగింది. ఈ కార్యక్రమంలో తెలుగు యువత జిల్లా నేత, క్లస్టర్ ఇన్చార్జి మోర్ల శివ, యూనిట్ ఇన్చార్జి గుడివాక పుండరీకాక్షుడు, పట్టణ టీడీపీ అధ్యక్షుడు షేక్ నబీఘోరి, బూత్ ఇన్చార్జి పావులూరి రామకృష్ణ, పరిశె రఘు, వాకా మారుతీరావు, లుక్కా శేషు తదితరులు పాల్గొన్నారు. స్థానిక నిమ్మలతోట, అగ్రహారంలలో ఇంటింటికీ వెళ్లి బాబుతో నేను కరపత్రాలను ప్రజలకు అందించి రాజకీయ కక్షతో చంద్రబాబును అరెస్ట్టేసిన విధానాన్ని ప్రజలకు తెలియచేశారు. చంద్రబాబుకు పలువురు మద్దతు తెలియచేస్తూ మిస్డ్‌కాల్ ఇచ్చారు. బాబుతో మేము అంటూ నినదించారు.

చంద్రబాబుకు ఏ చిన్న హాని జరిగిన ప్రభుత్వానిదే బాధ్యత

విశాలాంధ్ర - గన్నవరం : గన్నవరం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీగన్నవరం మండలం కార్యాలయం లో శనివారం నిర్వహించిన టి ఎన్ యు సి మీడియా సమావేశంలో నియోజకవర్గ అధ్యక్షులు ఆళ్ళ శ్రీనివాస్ నాయుడు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ఏ చిన్న హాని జరిగిన దానికి పూర్తి బాధ్యత జగన్మోహన్ రెడ్డి, ప్రభుత్వం బాధ్యత వహించాల్సి వస్తుంది అని ఆయన తెలియ చేశారు. సిగ్గు శరం లేకుండా ఒక బాధ్యత గల ప్రతిపక్ష నాయకుడి మీద ఆయన ఆరోగ్యం మీద అవాకులు చెవాకులు పేలుతు హేళన చేసే విదంగా మాట్లాడడం ఆయన దిగజారుడు తనానికి నిదర్శనం అని ఆయన అన్నారు. అనంతరం టి ఎన్ యుటిసిస్టేట్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ నాగ ప్రసాద్ బుస్సే మాట్లాడుతూ కోర్ట్ ఆదేశాలను జైళ్ల శాఖ నిబంధనలుని పూర్తిగా ఏ మాత్రం ఈ వైసీపీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఒక పథకం ప్రకారం బాబు అనారోగ్యం పాలు చేసి ఆయన ప్రాణాలకు ముప్పు కలిగేలా ఈ ప్రభుత్వ చర్యలు ఉన్నాయన్నారు.

చంద్రబాబు ఆరోగ్యంపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించాలి

విశాలాంధ్ర, మచిలీపట్నం : చంద్రబాబు ఆరోగ్యం ప్రమాదం అంచున ఉన్నా రాష్ట్రప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గమని తెలుగుదేశం నాయకులు విరుచుకుపడ్డారు. తెలుగుదేశం పార్టీ కార్పొరేటర్, చిత్తజల్లు నాగరాము (రాళ్ల కొట్టు రాము), తెలుగుదేశం పార్టీ కృష్ణాజిల్లా ప్రచార కార్యదర్శి, పి.వి.ఫణి కుమార్, టిడిపి నాయకుడు, లంకే హరికృష్ణ తదితరులు శనివారం మచిలీపట్నంలో దున్నపోతుకు వినతి పత్రం ఇచ్చి, చంద్రబాబు ఆరోగ్యంపై కేంద్ర ప్రభుత్వం దృష్టి పెట్టాలని వినూత్న రీతిలో దున్నపోతు దగ్గర చంద్రబాబుకి మద్దతుగా ప్లే కార్డు ప్రదర్శిస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబు ఆరోగ్యం ప్రమాదం అంచున ఉందని, జగన్మోహన్ రెడ్డి కనుసైగతో పనిచేస్తున్న రాష్ట్ర పోలీసు యంత్రాంగం పై మాకు నమ్మకం లేదని, జగన్మోహన్ రెడ్డి రాష్ట్రపోలీసు యంత్రాంగాన్ని తన గుప్పెట్లో పెట్టుకుని చంద్రబాబుకు హాని తల పెడుతున్నారు అని వారు మండిపడ్డారు.

చంద్రబాబుకు ఏమైనా జరిగితే పూర్తి బాధ్యత జగన్ దే

పెడన నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి కాగిత కృష్ణ ప్రసాద్

విశాలాంధ్ర - బంటుమిల్లి : చంద్రబాబు ఆరోగ్యానికి ఏమైనా హాని జరిగితే వైసిపి ప్రభుత్వంతోపాటు జగన్ తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని పెడన నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ కాగిత కృష్ణ ప్రసాద్ హెచ్చరించారు. బంటుమిల్లి మండలం పెదతుమ్మిడి పంచాయతీ పరిధిలో నరసప్ప చెరువు గ్రామంలో శనివారం చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా కాగిత ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ శ్రేణులు ఇంటింటికి వెళ్లి బాబుతో నేను కరపత్రాలను ప్రజలకు పంపిణిచేసారు. కాగిత కృష్ణప్రసాద్ మాట్లడుతూ చంద్రబాబు అక్రమ అరెస్టు గురించి, స్కిల్ డెవలప్మెంట్ కేసులో ఇప్పటివరకు ఏ ఆధారాలు చూపకుండ కోర్టులను సైతం తప్పుదోవ పట్టిస్తున్న వైఖరిని ప్రజలకు వివరించారు. నియోజవర్గ పరిశీలకులు సాథర బోయిన ఏడుకొండలు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ఆరోగ్యం పట్ల రాష్ట్ర ముఖ్యమంత్రి కక్ష సాధింపు చర్య అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ ప్రధాన కార్యదర్శి బొర్ర కాశి, టీడీపీ నాయకులు ఇల్లూరి లీలా కృష్ణ, బొల్లా శీను, భూపతి రమేష్, బేతు సత్యనారాయణ, గళ్ళ రామాంజనేయులు, బేతు రాంబాబు,రేవు గోపాలకృష్ణ, కాగిత బాలాజీ పాల్గొన్నారు.

వామపక్షాల ప్రజా బ్యాలెట్‌కు విశేష స్పందన

విశాలాంధ్ర, కూచిపూడి : రాష్ట్ర ప్రభుత్వంకరెంట్ బిల్లులతో వినియోగదారుల కళ్ళుగప్పి దొడ్డిదారిన సర్దుబాటు చార్జీల భారం, త్వరలో రానున్న రోజులలో స్మార్ట్ మీటర్లతో మరో ముప్పు లాంటి సమస్యలతో సతమతమవుతున్న విద్యుత్ వినియోగదారుల ఇబ్బందులపై వామపక్షాలు నిర్వహించిన ప్రజా బ్యాలెట్‌కు విశేష స్పందన లభించింది. కూచిపూడి పెదపూడి సెంటర్లోని ప్రజలే కాకుండా ద్విచక్ర వాహనాలపై పొరుగు ప్రాంతాల నుంచి తరలి వెళ్తున్న వాహనదారులు సైతం ఆగి మరీ ప్రజాబ్యాలెట్ బాక్స్ లో ఓటు వేసి ప్రభుత్వ ఏకపక్ష నిర్ణయాలపై తమ నిరసనను వ్యక్తం చేయటం విశేషం.! ఈ సందర్భంగా సిపిఐ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కే వి వి ప్రసాద్ ఓటు వేసిమాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వంలో విద్యుత్ బిల్లు చూడగానే షాక్ కొడుతోందని పెరిగిన బిల్లులతో జనం గగ్గోలు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం పెంచిన ధరలతో చెల్లించాల్సిన బిల్లులను చూసనిపేర్కొన్నారు. కెవిపీతో పాటు సిపిఐ జిల్లా కార్యదర్శి టీ తాతయ్య, పామర్రు నియోజకవర్గ కార్యదర్శి చెరుకు శ్రీనివాసరావు, నియోజకవర్గ సహాయ కార్యదర్శులు కోసూరు వెంకట అప్పారావు, చందోలు నాగేశ్వరరావు, శాఖా కార్యదర్శులు కొండ నాగేశ్వరరావు (కూచిపూడి), బోరు కాటి నరసింహారాజు, (కోసూరు), మోదుమూడిసద్గుణరావు (కళాయిగుంట), సిపిఐ సభ్యులు ప్రాజర్లమేర్రిరాజు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు శీలం నారాయణరావు, మండల కమిటీ సభ్యులు మద్దుల బసవయ్య, ఉప్పలపు వెంకటాద్రి, సీనియర్ కామ్రేడ్ పామర్తి కోటేశ్వరరావు, కూచిపూడి రోటరీ క్లబ్ పిఆర్ఓ పాగోలురమేష్ బాబుతదితరులు పాల్గొన్నారు.

బెరక మినిస్ట్రీస్ ఆర్థిక సహాయం

విశాలాంధ్ర - మచిలీపట్నం : కొన్ని సందర్భాల్లో ప్రతి ఒక్కరు మనోత్సాన్ని చాటుకోవాలని బెరక మినిస్ట్రీస్ అధ్యక్షులు డాక్టర్ బి ఎస్ కిరణ్ పాల్ అన్నారు. శనివారం మల్కా పట్నం వాస్తవ్యులు బోకినాల సాల్మన్ కుమారుడు మనోజ్ కుమార్ గత వారాల క్రితం తన వృత్తిలో పని చేసుకొనుచుండగా ప్రమాదవశాస్తూ కరెంటు షాక్‌కు గురై, ఎడమ చెయ్యి వరకు కోల్పోవటమే కాకుండా, తన శరీరము మొత్తం గాయాలతో నిండి ఉంది. కొన్ని వారాలుగా విజయవాడ అను హాస్పిటల్ నందు వైద్యము జరుగుతున్న విషయాన్ని, వారి ఆర్థిక పరిస్థితిని స్థానిక మచిలీపట్నం వాస్తవ్యులు బెరక మినిస్ట్రీస్ డాక్టర్ బి ఎస్ కిరణ్ పాల్ వారి దృష్టికి వచ్చింది, కిరణ్ పాల్ వారి బృందంతో అను హాస్పటల్లో ఉన్న మనోజ్ కుమార్‌ను పరామర్శించారు. వారి పరిస్థితిని చూచి వారికి ఆర్థికంగా 45 వేల రూపాయల తక్షణమే చెక్కు రూపన వైద్య ఖర్చుల నిమిత్తం అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నాగిశెట్టి డానియల్, కొడాలి చిన్న, కొండేటి రాజేష్, పల్లి శామ్యూల్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి కూచిపూడి దేవాలయంలో దసరా వేడుకలు..హాజరు కానున్న మంత్రులు

విశాలాంధ్ర, కూచిపూడి : నాట్య క్షేత్రమైన కృష్ణాజిల్లాలోని కూచిపూడిలో నాట్యాచార్యుల ఇలవేలపైన శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత రామలింగేశ్వర స్వామి దేవాలయంలో11 రోజులు పాటు జరిగే శరన్నవరాత్రి మహోత్సవాలలో తొలిరోజైన శనివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంస్కృతిక పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా, రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ తోపాడు జిల్లా అధికారులు పాల్గొంటారు. ఈ మేరకు ఆలయ ధర్మకర్తల మండల సభ్యులు చెప్పారు. ఈనెల 15వ తారీఖు నుంచి 24వ తారీఖు వరకు శరన్నవరాత్రి మహోత్సవాలు, చండీ హోమాలు, నిత్యాభిషేకాలు ఆలయ ధర్మకర్తల మండలి ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. విజయవాడ శ్రీ దుర్గా మల్లేశ్వరి స్వామి దేవాలయంలో కనకదుర్గమ్మ వారికి నిత్యం జరిగే రీతిలో బాలా త్రిపుర సుందరి అమ్మవారు వివిధ అలంకారాలుతో భక్తులకు దర్శనము ఇవ్వనున్నారు. 25వ తారీఖున లక్ష కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాలను పూర్ణ దీక్షాపరులు కొండూరు శ్రీకృష్ణయ్య(ఒంగోలు), వేద పండితులు రాళ్లపల్లి ఆంజనేయ శాస్త్రి (మచిలీపట్నం) చింతలపాటి రామకృష్ణ (ఉయ్యూరు)లతో నిర్వహిస్తారు. తొమ్మిది రోజులు దేవీ భాగవతాన్ని అగ్ని మాత్రం హయగ్రీవ రామచంద్రాచార్యులు (పెదపూడి), అమ్మవారికి అయ్యవారికి విశేష అలంకారాలు పెనుమూడి నాగ నరేంద్ర శర్మ, పూర్ణ చంద్రశేఖర శర్మ, సతీష్ శర్మ, రాకేష్ శర్మ, బాబురావుల పర్యవేక్షణలో కొనసాగుతాయి.

అంతా నా ఇష్టం..

- అక్రమాలు ప్రశ్నిస్తే పనుండదు..
- సెలవు పెడితే రూ.2వేలు సమర్పించాలి..
- డివిజన్ వ్యాప్తంగా అక్రమ వసూళ్లు..
- పట్టించుకోని ప్రజా ప్రతినిధులు, పై అధికారి..
- పరిశీలించి చర్యలు తీసుకుంటాం-సీఎంఓహెచ్

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : నగరంలో వాణిజ్య పరంగా, శానిటేషన్ పరంగా కీలకమైన డివిజన్లలో 25వ డివిజన్ ఒకటి. కాని ఇక్కడ పని చేస్తున్న శానిటేషన్ అధికారులు నియంతల్లా వ్యవహరిస్తూ కార్మికులను కాల్చుకు తింటున్నారు. కార్మికులందరి పట్ల సమ భావంతో వ్యవహరించకుండా డివిజన్‌లో తనకు అనుకూలంగా ఉండే వారి పట్ల ఒక రకంగా, తమపై జరుగు తున్న థాష్టికాన్ని ప్రశ్నించే వారి పట్ల కక్ష పూరితంగా వ్యవహరిస్తున్నట్లు బాధిత కార్మికులు ఆరోపిస్తున్నారు. అనారోగ్యంతోనో, శుభకార్యాలు, అశుభ కార్యాలుండి కార్మికులు సెలవు పెడితే దాన్ని తనకు అనుకూలంగా మలుచుకుని పైకమిస్తేనే మరుసటి రోజు పనికి రానిస్తారని, లేకుంటే రానివ్వరని బాధిత కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యాపారులు, తోపుడు బండ్లు వద్ద నెలా నెలా వసూళ్ల జోరులో ఆయనకు ఆయనే సాటి అని స్థానికంగా విమర్శలూ లేకపోలేదు. ఈయన వ్యవహారాన్ని స్థానిక ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేని, పై అధికారికి ఫిర్యాదు చేస్తే ఆయన కూడా సదరు శానిటేషన్ ఇనస్పెక్టర్‌నే వెనకేసుకు రావటంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఉన్నతాధికారులు ప్రతి కార్మికుని సమభావంతో చూస్తూ పారిశుధ్యం నిర్వాహణను సక్రమంగా నిర్వర్తించేలా చూడాలని అటు కార్మికులు, ఇటు స్థానికులు కోరుతున్నారు. పై అధికారులు వాస్తవాలను వెలికి తీసి గాడితప్పిన పారిశుధ్య నిర్వాహణను గాడిలో పెట్టాలని పలువురు సూచిస్తున్నారు.

నెలా నెలా అక్రమ వసూళ్లు..

ఈ డివిజన్‌లోని సదరు శానిటేషన్ ఇనస్పెక్టర్ కొబ్బరి బోండాలు విక్రయ దారులకు రేటు నిర్ణయించి ఒక్కో విక్రయ దారుని నుంచి నెలకు రూ.3వేలు, సీజన్‌లో మామిడి కాయలు విక్రయించే తోపుడు బండ్ల వద్ద రూ.3,500 వసూలు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. కొంత మంది చిరు వ్యాపారులు అంతిచ్చుకోలేమంటే పరిసరాలు అపుభ్రం చేస్తున్నారంటూ బండి పెట్టుకోనివ్వక పోవటం, అపరాధ రుసుం విదిస్తానని బెదిరించటంతో చేసేదిలేక అడిగిన కాడికి ఇవ్వలేక వ్యాపారులు సతమతం అవుతున్నట్లు పలువురు వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విషయాన్ని పై అధికారుల దృష్టికి తీసుకు వెళితే మరుసటి రోజు నుంచి ఉన్న కాస్త జాగా కూడా లేకుండా పోతుందేమోనని భయపడటం వారి వంతుగా మారటం విశేషం.

సెలవు పెడితే రూ.2వేలు..!

డివిజన్‌లో పని చేస్తున్న కార్మికులకు ఎవరికైనా ఒంట్లో బాగోలేకపోయినా, శుభకార్యాలు, అశుభ కార్యాలకు సెలవు పెట్టినా తరువాత పనికి రావాలంటే సదరు శానిటేషన్ ఇనస్పెక్టర్ రూ.2వేలిస్తేనే పనికి రానిస్తారని లేదంటే వెనక్కి తిప్పి పంపుతారని కార్మికులు చెబుతున్నారు. ఇటీవల ఓ కార్మికుడు 3 రోజులు సెలవు పెడితే పై అధికారికి ఇవ్వాలని రూ.2వేలు ఇస్తేనే పనికి రానిచ్చినట్లు పేరు చెప్పేందుకు భయపడుతున్న బాదిత కార్మికుడు చెప్పటం విస్మయాన్ని కలిగిస్తోంది. అధికారుల అక్రమార్జనను అరికడితే అటు కార్మికులు, ఇటు వ్యాపారులు పారిశుధ్య నిర్వాహణకు సహకరించి నగరాన్ని సుందరీకరణలో భాగస్వాములవుతారని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

ప్రశ్నిస్తే పనుండదు..

డివిజన్‌లో కొందరు కార్మికులు పని చేయకుండా ఎప్పుడు వస్తారో ఎప్పుడు వెళతారో అర్థం కాకుండా ఇనస్పెక్షన్‌కు వచ్చినట్లు వచ్చి వెళ్లిపోతుంటారని, ఆ పని భారం కూడా పని చేసే కార్మికులపై పడటం వల్ల ఇదేమని ప్రశ్నిస్తే మరుసటి రోజు పనికి రావద్దని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు బాదిత కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాక డివిజన్‌లో తనకు అనుకూలంగా ఉండేవారిని ఉదయం 10.30 గంటలయినా ఐరిస్ తీయటం, వ్యతిరేకులు ఉదయం 5.30 గంటలకు ఒక్క నిమిషం ఆలస్యమైనా వెనక్కి తిప్పి పంపుతూ వేదిస్తున్నట్లు కొందరు కార్మికులు కన్నీరు పెట్టుకోవటం గమన్వర్హం. మరి ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారిస్తారో లేదో వేచి చూడాల్సి ఉంది.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం-సీఎంఓహెచ్

25వ డివిజన్‌లో జరుగుతున్న పలు అవినీతి, అరాచ సంఘటనలపై విశాలాంధ్ర ప్రతినిది నగర పాలక సంస్థ చీఫ్ మెడికల్ ఆఫీసర్ రత్నావళి వివరణ కోరగా తాను సెలవులో ఉన్నానని సెలవు అనంతరం 25వ డివిజన్‌లో వచ్చిన ఆరోపణలును పరిశీలించి చర్యలు తీసుకుంటానని తెలిపారు.

విశాలాంధ్ర ఎన్టీఆర్ జిల్లా

విద్యుత్ చార్జీల ముసుగులో ప్రజలను మోసం చేస్తున్న జగన్ ప్రభుత్వం

ఎన్టీఆర్ జిల్లా సీపీఐ కార్యదర్శి దోనేపూడి శంకర్

విశాలాంధ్ర - ఏ కొండూరు : విద్యుత్ చార్జీలను తగ్గించాలని కోరుతూ ఏ కొండూరు మండలం చీమలపాడులో సిపిఐ ఆధ్వర్యంలో విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ధర్నా జరిగింది. ఏ కొండూరు మండల కార్యదర్శి మేకల డేవిడ్ అధ్యక్షతన జరిగిన సభలో ఎన్టీఆర్ జిల్లా సిపిఐ కార్యదర్శి దోనేపూడి శంకర్ ప్రసంగించారు. పన్నులు రహిత పాలన అందిస్తానని ప్రజలపై భారాలు వేయకుండా పరిపాలిస్తానని చెప్పి అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వం కరెంట్ చార్జీలను పెంచడంలో మోసానికి పాల్పడుతుందన్నారు. గత నాలుగు సంవత్సరాలుగా సర్‌చార్జీల పేరుతో ట్రూ అప్ విద్యుత్ చార్జీల పేరుతో విద్యుత్ సుంకంపేరుతో అదనపు చార్జీల పేరుతో బిల్లుల మోత మోగిస్తోంది.. విద్యుత్ సంస్కరణ పేరుతో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం నరేంద్ర మోడీ ఆదేశాలకు లోబడి స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజలను రైతాంగాన్ని దోపిడీ చేస్తుంది 7000 రూపాయలు ఖరీదు చేసే స్మార్ట్ మీటర్ను 36 వేల రూపాయలకు కొనుగోలు చేసి పెద్ద ఎత్తున ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తోంది బినామీ కంపెనీలకు దోచిపెడుతోంది ఇప్పటికి జగన్ ప్రభుత్వం కరెంటు చార్జీలలో 4సంవత్సరాల కాలంలో 8సార్లు కరెంట్ చార్జీలు పెరిగాయి. వెంటనే విద్యుత్ చార్జీల భారాలను తొలగించాలని డిమాండ్ చేశారు. ఎన్టీఆర్ జిల్లా సిపిఐ కార్యదర్శి వర్గ సభ్యులు తూము కృష్ణయ్య, తిరువూరు నియోజకవర్గ సిపిఐ కార్యదర్శి షేక్ నాగుల్ మీరా, సిపిఐ జిల్లా సమితి సభ్యులు. సంగుల పేరయ్య. సీనియర్ నాయకులు దాడి ఆదినారాయణ గద్దాటి జోజిబాబు. షేక్ కరీముల్లా సర్వేశ్వరరావు పంబీ మోహనరావు. కుప్పాల తిరుపతయ్య. కొలికపోగు కృష్ణ. సగ్గుర్తి కుమారి మేకల మోషే. తెల్లారి సంగీతరావు పాల్గొన్నారు

ఎస్సీ, ఎస్టీలకు ఉచిత కరెంటు..నీరుగార్చిన ప్రభుత్వం

సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు

విశాలాంధ్ర-విజయవాడ : వైసీపీ అధికారంలోకొస్తే ఎస్సీ, ఎస్టీ లకు ఉచిత కరెంటు ఇస్తామని ఎన్నికల ముందు వాగ్దానం చేసిన జగన్మోహన్ రెడ్డి నేడు అమలు చేయకపోవడం దుర్మార్గమని ఆ పథకాన్ని నీరుగార్చారని సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరావు అన్నారు. సీపీఐ 45వ డివిజన్ ఆధ్వర్యంలో శనివారం జోజి నగర్, రోటరీ నగర్‌లో ఇంటింటికి వెళ్లి పెంచిన విద్యుత్ చార్జీలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలు వివరిస్తూ ఎస్సీలు అధికంగా నివసించే జోజినగర్‌లో ఉచిత కరెంటు ఇస్తున్నారా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు? రాష్ట్రంలో విద్యుత్ బిల్లులు ప్రజలకు షాక్ ఇస్తున్నాయని, గతంలో రెండుమూడేళ్లకు ఒకసారి చార్జీలు పెంచే వాళ్ళని జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో గడిచిన నాలుగున్నర సంవత్సరాలలో ఇప్పటికీ ఏడుసార్లు పెంచి ప్రజలపై కోట్ల రూపాయల భారం వేసారని ఆవేదన వ్యక్తం చేశారు. 200 యూనిట్లులోపు వాడుకునే వారికి ఉచిత కరెంటు ఇస్తామని హామీ ఇచ్చి మాట తప్పారని విమర్శించారు. వినియోగించుకున్న బిల్లుతోపాటు ఫిక్సడ్ చార్జీలు, కస్టమర్ చార్జీలు, సర్ చార్జీలు, విద్యుత్ సుంకం, ట్రూ అప్ చార్జీలంటూ రకరకాల పేర్లతో ప్రజలపై తీవ్ర భారం మోపారన్నారు. విద్యుత్ రంగాల్లో సంస్కరణలు తీసుకొచ్చి ప్రజలపై భారాలు మోపుతున్నారని ఆరోపించారు. పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించి, ట్రూప్ చార్జీల పేరుతో వసూలు చేస్తున్న విధానాన్ని రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్ల ఆలోచనలు ఉపసంహరించు కోవాలని డిమాండ్ చేశారు. ఇంటింటికి ప్రభుత్వ వ్యతిరేక విధానాలు స్థానికులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి వర్గ సభ్యులు పంచదార్ల దుర్గాంబ, డివిజన్ పార్టీ సహాయ కార్య దర్శులు యెర్రసాని జోసఫ్, అంజురి సూరిబాబు,స్థానిక పార్టీ నాయకులు ఏవీ రంగారావు,ఆర్. సుబ్బారెడ్డి, పడాల తవుడమ్మ, గొమ తోటి రాంబాబు, చందు, రత్తమ్మ, వై.రాజు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

విశాలాంధ్ర-విజయవాడ : అభ్యుదయవాది నక్కా కోటేశ్వరమ్మ 9వ వర్ధంతిని పురస్కరించుకుని శ్రీ నక్కా రాములు, కోటేశ్వరమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదలకు, వృద్ధులకు అన్నదానం నిర్వహించారు. 36వ డివిజన్ బీఆర్‌టీఎస్ రోడ్డులో శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులను స్మరించుకుని వారి జ్ఞాపకార్థం అన్నదానం చేస్తున్న నిర్వాహకులను అభినందించారు. సీపీఐ నగర సహాయ కార్యదర్శి నక్కా వీరభద్రరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శివర్గ సభ్యులు మూలి సాంబశివరావు, పంచదార్ల దుర్గాంబ, ఏఐవైఎఫ్ నగర కార్యదర్శి లంకా గోవిందరాజులు, న్యాయవాదులు కె.అన్నారావు, కె.కృష్ణకిషోర్, టి.ఆంజనేయులు, సీపీఐ డివిజన్ శాఖ సహాయ కార్యదర్శి గుర్రం జమలయ్య, డివిజన్ మహిళా సమాఖ్య కార్యదర్శి నక్కా రాజ్యలక్ష్మి, నాయకులు జి.శ్రీనివాస్, పి.సాయి, జే.భాస్కర్, ఎంవీ.కృష్ణయ్య పాల్గొన్నారు.

మిక్ కళాశాలలో ఇన్నోవేషన్ డే

విశాలాంధ్ర- కంచికచర్ల: కంచికచర్ల మిక్ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీ ఇన్స్టిట్యూట్ ఇన్నోవేషన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఈ నెల 15న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని పరిష్కరించుకొని ఇన్నోవేషన్ డే కార్యక్రమం శనివారం నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి. వంశీ కిరణ్ తెలిపారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఇన్నోవేటివ్ ఐడియా చాలెంజ్, డొమైన్ స్పెసిఫిక్ రీసెంట్ ఇన్నోవేషన్, జస్ట్ ఎ మినిట్, స్కిట్ తదితర పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రశంశా పత్రాలు అందజేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నల్ దినకర్ పుండ్కర్ ఆదేశాల మేరకు నగర పరిశుభ్రతలో భాగంగా పరిసరాల పరిశుభ్రతతో పాటు నగరంలోని పాత బావులను, మురుగు కాల్వల నిర్వహణ కూడా సక్రమంగా జరగాలని స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహించడం జరుగుతుంది. ఈ సందర్భంగా బయాలజిస్ట్ సూర్య నాయక్ శనివారం ఉదయం వన్ టౌన్ మరియు సత్యనారాయణపురం ఏరియాలో పర్యటించి పాత బావులను గుర్తించి వాటిలో దోమల లార్వ వృద్ది చెంద కుండా మందులు కొట్టి బావులను పైన గుడ్డలతో కట్టడం, మురుగు కాలువల నిర్వహణ గురించి సూచనలు చేయడమైనది. బయాలజిస్ట్ సూర్య నాయక్, మలేరియా ఇన్స్పెక్టర్ మరియు శానిటేషన్ సెక్రటరీలు పాల్గొన్నారు.

అలుపెరుగని బాలల హక్కుల నేత టీవీ

విశాలాంధ్ర,విజయవాడ (గాంధీనగర్) : నగర ప్రథమ మేయర్ టీవీ ఆపదలో ఉన్న బాలలకు అండగా బాలల హక్కుల పరిరక్షణకు పాటుపడ్డారని ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్ నిర్వాహకులు బి.ఎస్.కోటేశ్వరరావు అన్నారు. ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్ వ్యవస్థాపక అధ్యక్షులు విజయవాడ నగర ప్రథమ మేయర్ టి వెంకటేశ్వరరావు (టీవీ) 10వ వర్ధంతి కార్యక్రమం ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. వివిధ స్వచ్ఛంద సేవ సంస్థల ప్రతినిధులు తొలుత టీవీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ ఎంతో ముందు చూపుతో 25 సంవత్సరాల క్రితం బాలల హక్కుల పరిరక్షణకు అందరినీ ఒకే వేదిక మీద పైకి తెచ్చిన గొప్ప వ్యక్తి టీవీ అని కొనియాడారు.ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్ ఏర్పాటు చేసి ఆపదలో ఉన్న బాలలకు అండగా నిలిచారని కొనియాడారు. ఆయన ఆశయాలు ముందుకు కొనసాగిస్తామని తెలియజేశారు. ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్ జిల్లా కోఆర్డినేటర్ అరవ రమేష్, ఎస్ కే సి వి చిల్డ్రన్ ట్రస్ట్ చీఫ్ కోఆర్డినేటర్ కే చంద్ర, బర్డ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ సెక్రటరీ కోటి ప్రకాష్ కుమార్,ప్రజా గాయకులు ఆర్ పిచ్చయ్య, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొని టీవీకి అంజలి ఘటించారు.

కిడ్నాప్ కలకలం

విశాలాంధ్ర-విజయవాడ (క్రైం): బెజవాడలో రియల్ ఎస్టేట్ వ్యాపారి కిడ్నాప్ కలకలం రేపింది. శనివారం అర్ధరాత్రి వైఎస్సార్ హెల్త్ యూనివర్శిటీ సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. అయితే గుడివాడకు చెందిన శ్రీనివాస్ నగరంలో మహానాడు రోడ్డులో ఎస్ఎస్ రియల్ ఎస్టేట్ వ్యాపారం నిర్వహిస్తుంటాడు. రెండేళ్ల సత్యనారాయణ అనే వ్యక్తి వద్ద కొంత భూములు కొనుగోలు చేశాడు. ఇద్దరి మధ్య కొంతకాలం గోడవలు జరుగుతున్నాయి. ఈనేపథ్యంలో శ్రీనివాసరావు మహానాడులోని తన ఆఫీసు నుంచి కారులో వెళ్తున్న సమయంలో వెస్సార్ హెల్త్ యూవర్శిటీ వద్ద మరో కారు వచ్చి అడ్డగించింది. కారులో ఉన్న కొంత మంది ఆగంతకులు పట్టుకుని వారి కారులో ఎక్కించుకుని వెళ్లిపోయారు. అయితే శ్రీనివాసరావు కుటుంబ సభ్యులకు సమాచారంతో మాచవరం పోలీసులు రంగంలో దిగ్గారు. కిడ్నాప్ జరిగిన స్థలాన్ని పరిశీలించి పటమటలంకలో ఓ ఇంట్లో ఉన్నట్లు గుర్తించారు. వెంటనే వారందరిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు పోలీసులు విచారిస్తున్నారు.

గ్రామ వైఎస్ఆర్‌సీపీ అధ్యక్ష పదవికి కాకాని హరిబాబు రాజీనామా

విశాలాంధ్ర -పెనుగంచిప్రోలు : పెనుగంచిప్రోలు గ్రామానికి చెందిన కాకాని హరిబాబు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా కొనసాగుచున్నాడు. శనివారం అయన విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి కొన్ని అనివార్య కారణాల వలన గ్రామ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తున్నాను, అలాగే నా భార్య కాకాని స్రవంతి ఎంపిటిసి పదవికి త్వరలో రాజీనామా చేయదలిచామని వారు తెలిపారు. పార్టీ ఆవిర్భావం నుండి పార్టీ కోసం అహర్నిశలు కష్టపడి పని చేశాను. 2019లో సామినేని ఉదయభాను గెలుపు కోసం నా వంతు కృషి చేశాను. అనంతరం జరిగిన స్థానిక ఎన్నికలలో అభ్యర్థుల గెలుపులో కీలక పాత్ర పోషించాను అన్నారు. కానీ ఎంతో చరిత్ర కలిగిన పెను గంచిప్రోలు అమ్మవారి దేవస్థానం నూతన పాలకవర్గం విషయంలో అనాదిగా వ్యవహరిస్తున్న సాంప్రదాయాలను ఆనవాయితీలను కొన సాగించ మని ఎమ్మెల్యే సామినేని ఉదయభానుకి కోరినాము. ఉదయభాను వైపు నుండి ఎటువంటి సమాచారం రాలేదు. మా కుల దేవత ..నిర్ణయాలలో మా మనోభావాలు దెబ్బతిన్నవి అన్నారు.

దేవీ నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

విశాలాంధ్ర-నందిగామ : మండలంలో పలు దేవాలయాలలో దేవి శరన్నవరాత్రి దసరా మహోత్స వాలు ప్రారంభ మయ్యాయి. విద్యుత్ దీపాలతో సర్వాంగ సుంద రంగా ఆలయాలు ముస్తా బయ్యాయి, అంబారుపేట గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ సత్య మ్మ అమ్మ వారి ఆలయ ఈవో పామర్తి సీతారామయ్య, ఆలయ కమిటీ చైర్మన్ అలోకం శ్రీనివాసరావు, ధర్మకర్తల మండలి సభ్యుల పర్యవేక్షణలో దసరా ఉత్సవాలు అత్యంత వైభవముగా నిర్వహించినట్లు శనివారం మీడియాకు తెలిపారు. దసరా పర్వదినాన మునిటి తీరాన గల శ్రీ ఓంకారేశ్వర స్వామి ఆలయం వద్ద సెమీ పూజ అనంతరం అమ్మవారి రథోత్సవం వైభవంగా నిర్వహించనున్నట్లు ఆల్ ఈవో సీతారామయ్య ఆలయ కమిటీ చైర్మన్ అలోకం శ్రీనివాసరావు తెలియజేశారు. సామూహిక కుంకు మార్చనలు, మూల మంత్ర హోమాది క్రతువులు, ప్రతిరోజు రాత్రి ఆలయం వద్ద కళావేదికవై సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో ,చైర్మన్ తెలిపారు, పల్లగిరి గట్టుపై వేంచేసిన త్రిశక్తి పీఠం, నందిగామ పట్టణంలోని శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయం, శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి శ్రీ చక్ర మందిరం, శ్రీ మరిడి మహాలక్ష్మి దేవాలయలలో దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

గ్రామాల్లో టీడీపీ బలోపేతం కావాలి

గన్నవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి యార్లగడ్డ వెంకట్రావు

విశాలాంధ్ర-హనుమాన్ జంక్షన్ : తెలుగుదేశం పార్టీని గ్రామల్లో బలోపేతం చేయటానికి ప్రతి ఒక్కరూ కష్టపడి పని చేయాలని గన్నవరం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. టీడీపీ బాపులపాడు మండల టీడీపీ అధ్యక్షులు దయాల రాజేశ్వరరావు అధ్యక్షతన శనివారం ప్రైవేట్ ఫంక్షన్ హాలులో పార్టీ సీనియర్ నాయకులు,మండలం లోని అన్ని గ్రామాల అధ్యక్షులు ప్రధాన కార్యదర్శులతో పరిచయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర మల్లవల్లి గ్రామానికి చేరుకున్న నేపద్యంలో సొంత స్థలంలో జామ తోటను నరికి క్యాంప్ సైట్‌ను అందించినందుకు అక్కినేని కృష్ణాజీకి వెంకట్రావు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ సమావేశంలో టీడీపీ సీనియర్ నేత ఆళ్ళ వెంకట గోపాల కృష్ణారావు,మండల ప్రధాన కార్యదర్శి పుట్టా సురేష్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చిరుమామిళ్ల సూర్యం, తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూల్పూరి సాయి కల్యాణి, తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్రా నరేంద్ర, కార్యనిర్వాహక కార్యదర్శి గుండపనేని ఉమావరప్రసాద్, కార్యదర్శి వేములపల్లి శ్రీనివాసరావు, రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి వేగిరెడ్డి పాపారావులతో పాటు మండలంలోని 27 గ్రామాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అమ్రిత సాయిలో క్యాంపస్ ప్లేస్‌మెంట్స్

24 మంది విద్యార్థుల ఎంపిక

విశాలాంధ్ర- కంచికచర్ల: కంచికచర్ల మండలం పరిటాల సమీపం లోని అమ్రిత సాయి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు హైదరాబాద్‌కు చెందిన ట్రూ ఫైలర్ కంపెనీలో ఉద్యోగాలు సాధించారని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శశిధర్ శనివారం తెలియ చేసారు. కంపెనీ హెచ్ ఆర్ ప్రతినిధులు కళాశాల బీటెక్ ఫైనల్ ఇయర్ విద్యార్థులకు వ్రాత పరీక్ష, గ్రూప్ డిస్కషన్స్, టెక్నికల్ మరియు హెచ్ ఆర్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. వీరిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులలో 24 మందిని కంపెనీ తరుపున మేనేజ్మెంట్ ట్రైనీ అసోసియేట్స్‌గా ఎంపిక చేసి 2 లక్షల వార్షిక వేతనం నిర్ణయించి వారికి నియామక ఉత్తర్వులు అంద చేసారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. శశిధర్ మాట్లాడుతూ 2023 -24 బ్యాచ్ విద్యార్థులలో 108 మంది ఇప్పటికే ఉద్యోగాలు సాధించటం తో పాటు 12 లక్షల హైయెస్ట్ ప్యాకేజ్‌తో సత్తా చాటారని తెలియ చేసారు. ఎంపికైన విద్యార్థులను సెక్రటరీ కరెస్పాండంట్ శ్రీ కె . రామ్మోహన రావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. శశిధర్, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ పి. చిరంజీవి, ప్లేస్మెంట్ కోర్డినేటర్ బి.రామారావు, అన్ని విభాగాల అధిపతులు, అధ్యాపకులు అభినందించారు.

అభ్యాస విద్యాలయంలో దసరా సంబరాలు

విశాలాంధ్ర-విజయవాడ : అభ్యాస విద్యాలయంలో దసరా సంబరాలు సరదా సరదాగా, కన్నుల పండువగా జరిగాయి. మతపరమైన నమ్మకాలను బోధించే విధంగా కాకుండా కేవలం ఒక సంప్రదాయంగా మాత్రమే వీటిని జరుపుతారు. పిల్లలు కులమతాలకు అతీతంగా పెరగాలన్న ఉద్దేశ్యంతో అభ్యాస విద్యాలయం రంజాన్, క్రిస్టమస్, వినాయకచవితి లాంటి అన్ని మతాల పండుగలను వాటి సంప్రదాయాలు ప్రతిబింబించే విధంగా జరుపుతుంది ఏ మతానికి సంబంధించిన పండుగలైనా వాటిలో పిల్లలకు సంతోషాన్నీ సంబరాన్నీ పంచే అంశాలు బోలెడుంటాయి. సంస్కృతిని ప్రతిబింబించే సంప్రదాయాలు పిల్లలకు వాటి గురించి తెలుసుకునే ఆసక్తిని కలిగిస్తాయి. తద్వారా తమది కానీ సంస్కృతి, సంప్రదాయాల పట్ల సహృదభావం కలుగుతుంది. దీనిలో భాగంగానే నగరాలలో మరుగైపోతున్న పిట్టలదొర, బుడబుక్కలవాళ్ళు, కాలభైరవలాంటి వేషగాళ్ళుగా పిల్లలు అలరించారు. పులివేషగాళ్ళు దప్పుదరువులకు చిందులేసి ఉర్రూతలూగించారు. చిన్న పిల్లల నుంచి టీచర్లవరకు లయబద్ధంగాకోలాటాలాడారు. రంగురంగుల రంగవల్లులు దిద్ది అందమైన బడుకమ్మలనలంకరించి చుట్టూ చేరి ఆడారు, పాడారు. దశావతారాల అమ్మవార్లుగా అమ్మాయిలు వేషాలు ధరించి మహిషాసుర మర్దనం ప్రదర్శించారు. చివరలో పదిడుగుల దశముఖ రావణుణ్ణి టపాసులతో కాల్చి సంబరాలను ముగించారు.

సెలవురోజు తరగతులు నిర్వహిస్తున్న నారాయణ కాలేజీపై చర్యలు తీసుకోవాలి : ఏఐఎస్ఎఫ్

విశాలాంధ్ర-విజయవాడ : విద్యాశాఖ అధికారులు రెంబవ శనివారం సెలవు ప్రకటించినప్పటికీ ఏమాత్రం లెక్కచేయకుండా విజయవాడ భవానిపురంలో ఉన్న నారాయణ జూనియర్ కాలేజ్ విద్యా సంస్థలు యధావిధిగా తరగతులు నిర్వహిస్తుంది. ఈ విషయాన్ని గురించిన ఏఐఎస్ఎఫ్ నాయకులు క్లాసులు నిర్వహిస్తున్న కాలేజీకి చేరుకుని కళాశాల యాజమాన్యాన్ని నిలదీశారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధం తలుపులు మూసేసి తరగతులు నిర్వహించటం ఏమిటి? అని ప్రశ్నించారు. యాజమాన్యంతో మాట్లాడి విద్యార్థులను ఇళ్లకు పంపించారు. నిబంధనలు అతిక్రమిస్తున్న విద్యా సంస్థలపై ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నగర అధ్యక్షులు అయ్యప్ప, కార్యవర్గ సభ్యులు భార్గవ్, నాయకులు వసీమ్ అక్రమ్, వెంకటేష్, మోహిన్‌షరీఫ్ ఉన్నారు.

తెలివైన విద్యార్థులకు అత్యుత్తమ అవకాశం

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): ప్రతిష్టాత్మకమైన పోటీ పరీక్షలలో రాణించేలా విద్యార్థులను ప్రోత్సహించడంలో సుప్రసిద్ధమైన ఫిట్జీ, బిగ్ బ్యాంగ్ ఎడ్జ్ టెస్ట్‌ను నిర్వహించబోతుంది. ఈ టెస్ట్‌ని ఈనెల 22, 29 తేదీల్లో ఆఫ్‌లైన్ మోడ్‌లో నిర్వహిస్తుంది. దీనితో పాటుగా, ఈస్కూల్ ప్రోగ్రామ్‌ల కోసం పరీక్ష ఆన్‌లైన్‌లో నిర్వహించబడుతుంది. ఇది ఐదు నుంచి 11వ తరగతి విద్యార్థులకు అందుబాటులో ఉంటుంది. వారు తమ సౌలభ్యం మేరకు పరీక్ష తేదీని ఎంచుకోవచ్చు. జేఈఈ మెయిన్, జేఈఈ అడ్వాన్స్‌డ్, బిట్ శాట్, ఒలింపియాడ్‌లు, టెన్త్, ట్వెల్త్ బోర్డ్‌లు, ఎన్టీఎస్ఈ, జూనియర్ ఒలింపియాడ్‌లు వంటి ప్రతిష్టాత్మకమైన పరీక్షలలో విద్యార్థులు రాణించడానికి ఈ పరీక్ష సమగ్రమైన, వినూత్నమైన విధానాన్ని అనుసరిస్తుంది. ఎంపికైన విద్యార్థులు ఫిట్జీ క్లాస్‌రూమ్ ప్రోగ్రామ్‌లు, ఇంటిగ్రేటెడ్ స్కూల్ ప్రోగ్రామ్‌లు లేదా 2024 ఏప్రిల్‌లో ప్రారంభమయ్యే లైవ్ ఆన్‌లైన్ క్లాస్‌రూమ్ ప్రోగ్రామ్‌లలో తక్కువ ఫీజులతో నమోదు చేసుకోవచ్చన్నారు.

కారు ఫల్టీ కొట్టిన ప్రమాదంలో ఒకరి మృతి

విశాలాంధ్ర- నందిగామ: మండలంలోని అనాసాగరం ఫ్లైఓవర్ దగ్గర యాక్సిడెంట్ చోటు చేసుకున్న సంఘటన, శనివారం చోటు చేసుకుంది. పోలీసు వారు దళిత సమాచారం ప్రకారం కారు అదుపు తప్పి మైల్ రాయిని ఢీ కొట్టి పల్టీ కొట్టడంతో ఒకరు మృతి చెందారు. పలువురికి తీవ్ర గాయాలు కాగా నందిగామ ప్రభుత్వ ఆసుపత్రికి 108 వాహనంలో తరలించారు. వారికి మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది తెలిపారు. ఈ విషయమై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుగుతున్నట్లు తెలిపారు.

చంద్రబాబు ఆరోగ్యంపై 14న 'మల్లయోధ' పుస్తకావిష్కరణ

విశాలాంధ్ర- కంచికచర్ల: మండలంలోని పరిటాల గ్రామంలో అక్టోబర్ 14వ తారీఖు శనివారం ఉదయం 10 గంటలకు 'మల్లయోధ' కవితా సంకలనం ఆవిష్కరణ. ఈ సంధర్భంగా ఎస్ ఆర్ జి ఈ ఎస్, బి ఎఫ్ టి నక్కా నాగేశ్వర రావు మాట్లాడుతూ స్త్రీల అభివృద్ధి పదాన్ని ఓర్వలేని పురుషహంకార సమాజం ఏదో రీతిలో మహిళలపై , చిన్నారులపై లైంగిక దాడులూ, వేధింపులు, అత్యాచారాలకీ ఒడిగడు తున్నారని, ఈ విషమ పరిస్థితి మారాలని అందుకు స్త్రీలు ముందడుగు వేసి భవిష్యత్ సమాజానికి ఆదర్శం కావాలని ఆవేదనను, ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

బాబు ఆరోగ్యం క్షేమంగా ఉండాలి

విశాలాంధ్ర- కంచికచర్ల: చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును ఖండిస్తూ ఆయన ఆయురారోగ్యాలతో క్షేమంగా ఉండాలని మండల టిడిపి పార్టీ అధ్యక్షులు కోగంటి బాబు ఆధ్వర్యంలో శనివారం పరిటాల శ్రీ ఆంజనేయస్వామి ఆలయ నందు కంచికచర్ల పరిటాల నక్కలంపేట దేశం శ్రేణులు కలిసి శనివారం ప్రత్యేక పూజలు గావించారు. కోగంటి మాట్లాడుతూ ఆరోగ్య సమస్యల విని ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు అన్నారు. తిరిగి ఆయన ఆరోగ్యం కోలుకోవాలని పూర్తి ఆయురారోగ్యాలతో ప్రజాక్షేత్రం లోకి మరల తిరిగి రావాలని మనస్పూర్తిగా రాష్ట్ర ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. చంద్రబాబు ను అరెస్ట్ చేసి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పైశాచిక ఆనందం పొందుతున్నారు అన్నారు. వైసిపి వారు ఎన్ని ఎత్తులు వేసిన చంద్రబాబు నాయుడు కడిగిన ఆణిముత్యంలో బయటికి వస్తారని కోగంటి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాగంటి బాబు, మాగంటి చిన్న పుల్లారావు, తాడపనేని లక్ష్మణరావు, గుత్త ఓంకార్, డాక్టర్ వీరస్వామి,బుడ్డి సూర్య ప్రకాష్, మాగంటి అబ్బాయి, నెమలిపురి గాంధీ, ఖదీర్, గురవయ్య, పోతురాజు శ్రీనివాసరావు, ఘనపనేని సాంబశివరావు, జానకి రామయ్య, సతీష్, ఖాజా, కె సురేష్, సురేంద్ర,ఉప్పు తిరుపతమ్మ, విజయ్ రావ్, తదితర దేశం నాయకులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, **Sathyanarayana Rachamalla** (Old Name) S/o. Late Seshaiah, residing at #16-2-24/1, Lakshmana Rao Street, Poornanandampeta, Back Side Vikram Hotel, Vijayawada Urban, Gandhinagram, NTR. District-520003, Andhra Pradesh. **I changed my name to Satyanarayana Rachamalla** (New Name) Hence forth I will be known as **SATYANARAYANA RACHAMALLA**

CHANGE OF NAME

I, **Lakshmi Sujani Katragadda (Old Name)**, W/o. Bharat Chandra Katragadda, residing at D.No. 32-9-1-C, 1st Cross, AS Rama Rao Road, Moghalrajpuram, Vijayawada-520010. NTR District, AP. **I have changed my name to LAKSHMI SUJANI CHIGURUPATI (New Name).** Hence forth I will be known as **LAKSHMI SUJANI CHIGURUPATI**

దావా నోటీసు

మహారాజశ్రీ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు : మైలవరం

O.S. No. 110/2021

బిట్వీన్ :
నెమలికంటి చినమ్మాయి ... వాది
మరియు
గోళ్ళ ద్రౌపతి (గృహిణి), భర్త తిరుపతిరావు
R/o హెచ్.ముత్యాలపాడు గ్రామం,
జి.కొండూరు (మం), ఎన్టీఆర్ జిల్లా
.... ప్రతివాది

పై కోర్టు నందు మీ యొక్క హాజరు నిమిత్తం ది. 09-11-2023వ తేదీన వాయిదా వేసినారు. సదరు తారీఖున మీరు గానీ, మీ తరపున న్యాయవాది గారు గానీ హాజరై సమాధానం తెలుపగలరు. (ఆ రోజు ఉదయం 10.30 ని॥లకు సదరు కోర్టు నందు) లేని యెడల పరోక్షమున తీర్మానించబడును.

వాయిదా : 09-11-2023
(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)

Madu Anjaneyulu, Advocate
2nd Floor, Sunkara Complex,
Opp : Vetarinary Hospital, Main Road, Mylavaram
Cell : 99490 62339

లైసెన్సు లేకుండా వ్యాపారం చేయొద్దు

జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : ప్రతివారం జరిగే మొబైల్ కోర్టులో భాగంగా కార్పొరేషన్ కోర్టు న్యాయమూర్తి వీ.విజయ్‌కుమార్‌రెడ్డి మంగళవారం సర్కిల్-2 కార్యాలయంలో మొబైల్ కోర్టు నిర్వహించారు. దీనిలో సర్కిల్-2 పరిధిలోని శానిటరీ ఇన్స్పెక్టర్లు పాల్గొని చెత్త రోడ్లపై వేసేవారు, మురుగు ప్రవాహానికి అడ్డుపెట్టేవారు, రోడ్ల పైన పెంపుడు జంతువుల్ని వుంచు వారు, లైసెన్స్ లేకుండా వ్యాపారం నిర్వహించుచున్న వారిపై కేసులు పెట్టి మొత్తం 24 మంది పైన మొబైల్ కోర్టులో చార్జి సీటు దాఖలు చేసి 7,280 రూపాయలు అపరాద రుసుము కింద వసూలు చేశారు. మరోసారి ఈ విధంగా నిబంధనలకు విరుద్ధంగా చేస్తే చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం న్యాయమూర్తి వారికి కౌన్సిలింగ్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్-2, హెల్త్ ఆఫీసర్లు, శానిటరీ సూపర్వైజర్లు, శానిటరీ ఇనస్పెక్టర్లు, శానిటరీ సెక్రెటరీలు పాల్గొన్నారు.

ఎలుకల నివారణపై అవగాహన

విశాలాంధ్ర, కూచిపూడి : ఖరీఫ్ సీజన్లో వరిపైరుపై దాడి చేస్తున్న ఎలుకలను సామూహికంగా నిర్మూలించే విధానంపై శనివారం పెదపూడి రైతు భరోసా కేంద్రం వద్ద వ్యవసాయ శాఖ సిబ్బంది రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వాటిని నివారించేందుకు వినియోగించే రసాయనాలతో కూడిన బ్రోమోడియోలోన్ తయారు చేసే విధానాన్ని చూపించటం తోపాటు రైతులకు నూరు శాతం సబ్సిడీ పైమందును పంపిణీ చేశారు. 100 గ్రాముల గ్రాముల విషపు ఎర తయారీకి 96 గ్రాములు నూకలు, రెండు గ్రాముల బ్రోమోడియోలోన్, రెండు గ్రాముల వేరుశనగ నూనెలను బాగా కలిపి, తయారైన ఎర్రను చిన్న చిన్న పొట్లాలుగా కట్టాలని వివరించారు. ఆ విషపు ఎర పొట్లాలను సాయంత్రం వేళలో ఎలుకల బొరియల వద్ద పెట్టాలని సూచించారు. ఈ విధంగా దశలవారీగా ఈ ప్రక్రియ నిర్వహించి ఎలుకలను నివారించుకోవచ్చునని సూచించారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ మాజీ అధ్యక్షుడు తాత రాంబాబు, పామర్రు పాలసీదుల కేంద్రం రూట్ సూపర్వైజర్ కైలా రమేష్, గ్రామ సర్పంచ్ తాతా రజిని, వీఆర్వో జె కోటేశ్వరరావు, వి.ఏ.ఏ. ఎం.శ్రావణి, వాలంటీర్లు, రైతులు పాల్గొన్నారు.

16న రిటైర్డ్ ఉద్యోగులకు ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర - గన్నవారం : ఈ నెల 16 తేదీన గన్నవరం రిటైడ్ ఉద్యోగుల భవనం నందు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు అవుటపల్లి మోహనరావు తెలిపారు. సోమవారం ఉదయం10.30 నుండి మధ్యాహ్నం1 వరకు నిర్వహితమని అన్నారు. ఆయన మాట్లాడుతూ విజయవాడ వైద్యులు మాక్స్ విజన్ కంటి ఆసుపత్రి వైద్యులు కృష్ణ సాయి దంతవైద్యశాల డాక్టర్స్ పరీక్షలు, ఈ ఎన్టీ వినికిడికి సంభందించన్న డాక్టర్స్ కూడా వస్తారు. టెస్టులు నిర్వహిస్తారు. రిటర్డ్ ఉద్యోగులు తమ ఐడి కార్డును తీసుకొని రావాలి. రిటర్డ్ ఉద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమాల్లో బి కొటేశ్వరవు, షేక్ ఆదాంవల్లి సాహెబ్,బి వి కృష్ణారావు,ఎస్ వెంకటేశ్వరవు తదితరులు,పాల్గొన్నారు.

శానిటేషన్‌ను పరిశీలించిన డీపీఓ

విశాలాంధ్ర - వత్సవాయి : మండల కేంద్రమైనలో శనివారం జిల్లా పంచాయతీ అధికారి జయ చంద్ర గాంధీ శానిటేషన్ ను పర్యవేక్షించారు ఎస్సి, ఎస్టీ, బీసీ కాలనీలను పరిశీలించారు. ఈ కార్య క్రమంలో భాగంగానే ఆయన కూడా సిబ్బందితోపాటు శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శానిటేషన్ విషయంలో ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని ప్రస్తుతం విష జ్వరాలు ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉన్నందున సంబంధిత అధికారులు శానిటేషన్ పై అప్రమత్తంగా ఉండాలని పలు సలహాలు సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భూక్య సీతమ్మ జడ్పిటిసి సభ్యులు దేవమణి శ్రీనివాస్ గ్రామ నాయకులు రాజా పంచాయతీ కార్యదర్శి షేక్ ఇమామ్ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం మార్గం

విశాలాంధ్ర - విజయవాడ ఎడ్యుకేషన్ : వికాస్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం కౌన్సిలింగ్ సెషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా దీప్తి తుమ్మూరి హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ ప్రస్తుత యువత సెల్ ఫోన్‌కి అడిక్ట్ అయ్యి వారి బంగారు భవిష్యత్తు ను నాశనం చేసుకుంటున్నారన్నారు. విద్యార్థినీ విద్యార్థులు వారు ఎదుర్కొంటున్న టువంటి టెన్షన్, భయాందోళనలు పోగొట్టుకోవడం కోసం కొన్ని ప్రక్రియలతో పాటు బ్రీతింగ్ ఎక్ససైజస్ తన్య క్రియా ధ్యానం చేయించారు. ఈ కార్యక్రమంలో వికాస్ విద్యాసంస్థల అకాడమిక్ అడ్వైజర్ ఎస్. కీర్తి మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత ఉన్నత లక్ష్యాలను సాధించాలంటే అన్ని విషయాలపై పట్టు సాధించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్లేస్మెంట్ ఆఫీసర్ ఎస్ కిషోర్ బాబు అధ్యాపకులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

భారతీయ మార్కెట్లోకి ఒప్పో ఫైండ్ ఎన్3 ఫ్లిప్ విడుదల

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): ఒప్పో ఇండియా తన సరికొత్త ఫోల్డబుల్, ఫైండ్ ఎన్3 ఫ్లిప్ ను రూ.94,999 ధరతో విడుదల చేసింది. ఇది ఈనెల 22న సాయంత్రం 6 గంటలకు క్రీమ్ గోల్డ్, స్లీక్ బ్లాక్ రంగులలో ఒప్పో స్టోర్లు, ఫ్లిప్ కార్ట్, మెయిన్ లైన్ రిటైల్ అవుట్లెట్లలో అందుబాటులోకి వస్తుంది. ఫైండ్ ఎన్3 ఫ్లిప్ కేవలం 198 గ్రాముల బరువును, మడతపెట్టినప్పుడు కేవలం 8.55 సెంమీ పొడవు ఉంటుంది. ఏదైనా పర్స్ లేదా జేబులో సరిగ్గా ఇమిడిపోతుంది. స్మార్ట్ ఫోన్ ఫ్లిప్ పరికరంలో పరిశ్రమ మొట్టమొదటి హాసెల్ బ్లాడ్ బ్యాక్డ్ ట్రిపుల్ రియర్ కెమెరా సెటప్ కూడా కలిగి ఉంది. దీనిలో 90 శాతం కన్నా ఎక్కువ ఆండ్రాయిడ్ యాప్‌లు వర్టికల్ ఓరియెంటేషన్‌కు అనుగుణంగా ఆప్టిమైజ్ చేశారు. ఫలితంగా, ఫైండ్ ఎన్3 ఫ్లిప్ జీమెయిల్, ఫోటోలు, బొట్లుక్, ఉబర్, ఎక్స్, గూగుల్ మ్యాప్స్ తో సహా 40కి పైగా యాప్ లకు మద్దతు ఇస్తుంది.

శరన్నవరాత్రి వేడుకల అంకురార్పణ



విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): విజయవాడ సీవీఆర్ ఫ్లై ఓవర్ బ్రిడ్జి సమీపంలోని శ్రీ దేవీ కరుమారి అమ్మన్ శక్తి పీఠంలో శనివారం ఉదయం దసరా శరన్నవ రాత్రి వేడుకలు లాంఛనంగా అంకురార్పణ జరిగింది. పీఠం ఆనవాయితీ ప్రకారం ఫెర్రీ సమీపంలో పవిత్ర సంగమం వద్ద 11 మంది ముత్తైదువులతో 11 కలశాల్లో కృష్ణా గోదావరి పవిత్ర జలాలు సేకరించి అమ్మవారి శక్తి పీఠానికి తీసుకొచ్చారు. ఐతే ఈ శనివారం భాద్రపద అమావాస్య , మహాలయ అమావాస్య శని అమావాస్య చాలా అత్యంత శక్తవంతమైన అమావాస్య కనుక ఈరోజున ఆది పరాశక్తి శ్రీ దేవి కరుమారి అమ్మన్ వారిని ఉత్సవమూర్తి (భోగమూర్తి)నీ కృష్ణమ్మ నది దగ్గర కు తీసుకువెళ్ళి అమ్మవారికి నది స్నానం చేపించి నది నుండి 11 కలశాలు తీసుకొని వచ్చి ఆ జలం లో వేదోక్తం గా పీఠం లో ఉన్న మూల మూర్తికి కలశ,శంఖ,పంచామృత అభిషేకం చేసి దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు అంకురార్పణ చేశారు.

కుంభకోణంలో సూత్రధారులపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర,విజయవాడ (గాంధీనగర్) : గిరిజన గురుకులాల నిధుల కుంభకోణంలో సూత్రధారులపై చర్యలు తీసుకోవాలని గిరిజన సాంస్కృతిక సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మన్న దొర డిమాండ్ చేశారు. శనివారం గాంధీనగర్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గురుకులం సొసైటీలకు కేంద్రం నుంచి వచ్చిన నిధులు 40 కోట్ల రూపాయలను దొంగ బిల్లులతో మంగళగిరి గురుకులం సొసైటీలో పనిచేస్తున్న అధికారులు ఈఎంఆర్ఎస్, మినీ గురుకుల స్కీములు మధ్యవర్తుల ద్వారా తమ ఖాతాలకు మళ్లించుకున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు కొండా వీరభద్రరావు ,మడి సమ్మన్న దొర, సవలం వీరబాబు దొర, యం బాపిరెడ్డి, కె రాంబాబు దొర తదితరులు పాల్గొన్నారు.

జగన్‌కు ఓట్లు వేసి... మా గొంతు మేమే కోసుకున్నాం : పాలేటి

విశాలాంధ్ర,విజయవాడ (గాంధీనగర్) : జగన్ ప్రభుత్వానికి ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, బీసీలు ఓట్లు వేసి మా గొంతు మేమే కోసుకున్నామని సమతా సైనిక్ దళ్ రాష్ట్ర అధ్యక్షుడు పాలేటి మహేశ్ అన్నారు.శనివారం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, బీసీలను సీఎం జగన్ ఓటు బ్యాంకుగా మాత్రమే చూస్తున్నారని మండిపడ్డారు.జగన్ ప్రభుత్వంలో కీలక పదవులు అన్నింటిని ఆయన సామాజికవర్గానికి చెందిన వారికే కట్టబెట్టారని ఆరోపించారు.ఉన్నతమైన చదువులు, ఇతర అర్హతలు కలిగి ఉన్న దళితులను జగన్ ప్రభుత్వం విస్మరించిందన్నారు. రాష్ట్రంలో కక్ష సాధింపు రాజకీయాలు నడుస్తున్నాయన్నారు. రాజ్యాంగ అధికారం కోసం సమతా సైనిక్ దళ్...రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా కలిసి పనిచేస్తుంది రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాజీ సైనికోద్యోగి పిల్లి సురేంద్రబాబు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గొల్ల వరప్రసాద్,ఇతర సభ్యులు ఆల్గొన్నారు.

టిక్కెట్ క్యూలలో ఉండకుండా యూటీఎస్ మొబైల్ అప్లికేషన్

విశాలాంధ్ర,విజయవాడ (గాంధీనగర్) : ప్రయాణీకులు గంటల సమయం క్యూలైన్‌లలో టిక్కెట్ కోసం ఉండకుండా యూ.టి.ఎస్ మొబైల్ అప్లికేషన్ ద్వారా అన్ - రిజర్వ్ డ్ టిక్కెట్ల కొనుగోలు సౌకర్యం ఉపయోగించుకుంటే సమయం,పత్తిడి లేకుండా హాయిగా ప్రయాణించవచ్చు.యూ.టి.ఎస్ యాప్ ద్వారా అన్ రిజర్వ్ డ్ బుకింగ్లలో 14.8 శాతం రికార్డును సాధించిన దక్షిణ మధ్య రైల్వే రిజర్వ్ టిక్కెట్ల కొనుగోలును ప్రయాణీకులకు సులభతరం, సౌకర్యవంతం చేయడానికి 'యూ.టి.ఎస్ మొబైల్ అప్లికేషన్ను ప్రవేశపెట్టింది. ఈ యాప్ ప్రారంభమైనప్పటి నుండి ప్రయాణికుల నుండి సానుకూల స్పందన వస్తుంది. యాప్ ఉపయోగించే ప్రయాణికుల సంఖ్య రోజురోజుకు పెరుగుతుంది.

ఉత్తమ కవిత్వం సజీవమైనది

విశాలాంధ్ర-విజయవాడ : జీవితంలోని వెలుగు, చీకట్లకు అక్షరరూపమే కవిత్వం, ఉత్తమ కవిత్వం సజీవమైనదని ప్రముఖ కవి గంటేడ గౌరునాయుడు అన్నారు. శనివారం ఎక్స్ రే సాహిత్య మాస పత్రిక నిర్వహణలో జాతీయస్థాయి కవితల పోటీ 2022 అవార్డుల బహూకరణ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాల్‌లో జరిగింది. ఈ కార్యక్రమంలో కవితలపోటీ న్యాయనిర్ణేతగా గౌరునాయుడు విచ్చేసి ప్రసంగిస్తూ వచనమైనా, పద్యమైనా అందులో కవిత్వం లేకపోతే ఎవరినీ ఆకర్షించదని, కవిత్వం జీవధాతువులాగా ఉండాలని అన్నారు. ఏ ప్రక్రియయైనా ప్రజలు నెత్తిమీద పెట్టుకున్నా, నేలకు విసిరి కొట్టినా ఆయా కవులే కారణం అన్నారు. వర్తమాన కవులు మంచి పరిపక్వత కవిత్వం వ్రాస్తున్నారని అన్నారు. దివంగత ప్రముఖ పద్యకవి పువ్వాడ తిక్కన సోమయాజి కుమారులు శివరామ విట్టల్, వేణుగోపాల్ సభను ప్రారంభిస్తూ తమ తండ్రి వలే సాహితీ సృజన చేయలేమని అయినా సాహితీ సేవ ఎల్లవేళలా అందించగలమన్నారు. సభకు అధ్యక్షత వహించిన ఎక్స్ రే సాహిత్య మాస పత్రిక సంపాదకులు కొల్లూరి ప్రసంగిస్తూ కవికి సామాజిక స్పృహ, అధ్యయనం అవసరం అన్నారు. గత 42 సంవత్సరాలుగా కవిత్వం లో పోటీలు నిర్వహిస్తూ కవులు సాహితీ ప్రతిభ మెరుగుపరుస్తున్నామన్నారు.

అనంతరం జాతీయ కవితల పోటీలు 2022 ఎక్స్ రే అవార్డుల ప్రధానంలో భాగంగా తిరుపతి జిల్లా నల్లిరెడ్డిపాలెంకు చెందిన నల్లు రమేష్‌కు రూ.12,000 సగదు, జ్ఞాపిక, శాలువాతో సత్కరించారు. వీరితో పాటు సాంబమూర్తి (లండ ఉంకులూరు), బి కళాగోపాల్(నిజామాబాద్), పొత్తూరి సీతారామారావు(కాకినాడ), అవ్వారు శ్రీధర్ బాబు(నెల్లూరు), శిఖ ఆకాష్(నూజివీడు), తూపులి రవీంద్రబాబు (విజయవాడ), కొంపెల్ల కామేశ్వరరావు(హైదరాబాదు), తిరువాయ పాటి రాజగోపాల్(తిరుపతి), పద్మ సుధామణి(నాయుడుపేట) నగదు,జ్ఞాపిక, శాలువాతో వేదికపై ఉన్న అతిధులు ఘనంగా సత్కరించారు. అనంతరం కవులు తమ ప్రతి స్పందన వినిపించారు. సభలో వాకర్స్ గవర్నర్ డీవీ ఎస్ రామలింగరాజు తెలుగు భాష అభ్యున్నతికి మనం అందరూ కృషిచేయాలి అన్నారు. న్యాయనిర్ణేత, ఉత్తరాంధ్ర కవి గంటేడ గౌరునాయుడు కవితలను సమీక్షించారు. ఎక్స్ రే కార్యదర్శి బోడి ఆంజనేయ రాజు, ఉపాధ్యక్షులు కందికొండ రవికిరణ్, సీహెచ్‌వీ సుబ్బయ్య, పొత్తూరి సీతారామారావు, బ్రహ్మదేశం వసంతకుమార్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

రోటరీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం

విశాలాంధ్ర -పమిడిముక్కల: అక్టోబరు: 14: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన సేవలు అందించటమే రోటరీ ఉద్దేశం మని ఉయ్యూరు రోటరీ అధ్యక్షులు సిహెచ్.టి.వెంకటేశ్వర రావు అన్నారు.శనివారం హనుమంతపురం లో కె.సి.పి.మరియు రోటరీ కమ్యూనిటీ సర్వీస్ ట్రస్టు ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. డా,, రవి కుమార్ (యం.డి.) డా,,ఎల్.అనిత (డెంటల్) వైద్యులు రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ సెక్రటరీ నాగ సుబ్రహ్మణ్యం కె.సి.పి. జనరల్ మేనేజర్ వి.వి.పున్నారావు డి.జి.యం. సూర్యారావు డిప్యూటీ మేనేజర్ శ్రీరామచంద్ర రావు గ్రామస్తులు ఎల్.బాబు రావు మండవ వెంకటాద్రి ఉన్నారు.

జూనియర్ నేషనల్ సాఫ్ట్ టెన్నిస్ టోర్నీకి సర్వం సిద్ధం

- ఐజీఎంసీ స్టేడియంలో ఫ్లడ్‌లైట్ల వెలుగులో మ్యాచ్‌లు
- నేడు టోర్నమెంట్‌ను ప్రారంభించనున్న పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కే రోజా

విశాలాంధ్ర విజయవాడ స్పోర్ట్స్: విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ (ఐజీఎంసీ) స్టేడియం తొలిసారిగా 18వ జూనియర్ నేషనల్ సాఫ్ట్ టెన్నిస్ బాలుర, బాలికల ఛాంపియన్‌షిప్‌కు ఆతిథ్యం ఇవ్వనుంది. ఈ టోర్నమెంట్ అక్టోబర్ 15 నుండి 19 వరకు షెడ్యూల్ చేయబడింది. అక్టోబర్ 15 (ఆదివారం) టోర్నమెంట్‌ను పర్యాటక, సాంస్కృతిక మరియు యువజన అభివృద్ధి శాఖ మంత్రి ఆర్‌కె రోజా ప్రారంభించనున్నారు. ఇందిరాగాంధీ స్టేడియం టెన్నిస్ కాంప్లెక్స్ జూనియర్ నేషనల్ సాఫ్ట్ టెన్నిస్ మ్యాచ్‌లను నిర్వహించడానికి సిద్ధంగా ఉంది. ఆంధ్రప్రదేశ్ సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ ఫ్లడ్‌లైట్ల వెలుగులో టోర్నీని నిర్వహించడానికి మూడు సింథటిక్ కోర్టులను సిద్ధం చేసింది. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) మరియు ఎన్‌టిఆర్ జిల్లా క్రీడా ప్రాధికారసంస్థ (డిఎస్ఎ) జాతీయస్థాయి జూనియర్ నేషనల్స్ నిర్వహణకు తమ సహకారం అందిస్తున్నాయి.ఐదు రోజుల పాటు జరిగే ఈ టోర్నీలో పాల్గొనేందుకు దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల జట్లు శనివారం విజయవాడ చేరుకున్నాయి. అలాగే, ఈ జట్లు స్టేడియంలో తమ ప్రాక్టీస్ సెషన్‌ను ప్రారంభించాయి.ఈ టోర్నీలో 20 రాష్ట్రస్థాయి బాలబాలికల జట్లు పాల్గొంటున్నాయి. టీమ్ ఈవెంట్‌లు, మిక్స్‌డ్, డబుల్స్ మరియు వ్యక్తిగత విభాగాల్లో అన్ని మ్యాచ్‌లు నాకౌట్ విధానంలో నిర్వహించబడతాయి. ఆంధ్రప్రదేశ్ సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ ప్రతినిధులు మరియు ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు అన్ని రాష్ట్ర జట్లకు విజయవాడలోని పటమటలోని ఐజిఎంసి స్టేడియం మరియు చెన్నుపాటి రామకోటయ్య మున్సిపల్ కార్పొరేషన్ ఇండోర్ స్టేడియంలో వసతి కల్పించారు.అందులో భాగంగా ఐజీఎంసీ స్టేడియంలో ఆంధ్రప్రదేశ్ జట్టుకు ముఖ్యమంత్రి భద్రతా అధికారి జోషి జెర్సీలను బహూకరించారు. విజయవాడలో టోర్నీ నిర్వహించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోనే విజయవాడ స్పోర్ట్స్ హబ్ అని, ఐజీఎంసీ స్టేడియం నుంచి ఎందరో దిగ్గజాలు తయారయ్యారని అన్నారు.ఈ కార్యక్రమంలో లెఫ్టినెంట్ కల్నల్ కె సత్యనారాయణ, ఇంటెలిజెన్స్ డిఎస్పీ అజ్మతుల్లా, ఆంధ్రప్రదేశ్ సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ చైర్మన్ దారం నవీన్ కుమార్, అనంతపురం జిల్లా కార్యదర్శి మేరీ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

నగరంలో ప్రారంభమైన దసరా సందడి

విశాలాంధ్ర-విజయవాడ : నగరంలో దసరా పండుగ సందడి ప్రారంభమైయింది. ఇంద్రకీలాద్రిపై కనకదుర్గ అమ్మవారికి పది రోజుల పాటు వివిధ అలంకారాలతో దేవదాయ శాఖ వైభవంగా నిర్వహిస్తుంది. దీంతో పాటు నగరంలోని అనేక ప్రాంతాల్లో వేడుకలు నిర్వహిస్తారు. కూడళ్లలో పెద్ద పెద్ద మంటపాలు ఏర్పాటు ఉత్సవాలు నిర్వహిస్తారు. అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించి నిత్యం పూజాదికాలు చేస్తారు. మొగల్రాజపురం కొండపై మరో కనకదుర్గమ్మ ఆలయం ఉంది. అక్కడా నవరాత్రి వేడుకలు చేస్తారు. 6వ డివిజన్‌లో చంద్ర రాజేశ్వరరావు రోడ్డును విద్యుత్ దీపాలతో అలంకరించారు. చిట్టినగర్‌లో పెద్దమ్మవారి ఆలయాన్ని సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు. భారీ సెట్టింగ్‌లతో వేడుకలు చేస్తున్నారు. అన్న సంతర్పణ కార్యక్రమం నిర్వహిస్తారు. దసరా అనంతరం డివిజన్‌ల వారీగా డీజేలు, బేతాళ, టక్కుటమార విద్యలతో అమ్మవారి వివిధ రూపాల వేషదారణలతో ఊరేగింపు ఉత్సవాలు చేస్తారు. ఇక పాఠశాలలకు దసరా సెలవులు ప్రకటించటంతో ప్రయాణాల హడావిడి నెలకొంది. షాపింగ్ కాంప్లెక్స్‌లు వినియోగదారులతో కిటకిటలాడుతున్నాయి. పండుగ ఆఫర్స్ నేపత్యంలో కొత్త వస్తువుల కొనుగోలుకు ప్రజలు ఆశక్తి చూపిస్తున్నారు. వివిధ సంస్థల్లో దిగువ తరగతి సిబ్బంది దసరా మాములు వసూళ్లలో బీజీ అవుతున్నారు. నగరంలో అనేక ప్రాంతాల్లో విద్యుత్ దీపాల అలంకరణ, వినియోగదారులు హడావిడి, బంధువుల రాకపోకలు, కళా సంస్థల ప్రత్యేక ప్రదర్శనలు, ఇళ్లలో పూజాదికాలు తదితర కార్యక్రమాలతో నగరంలో పండుగ కోలాహలం నెలకొంది.

కొర్నిపాడులో బాబుతో నేను

విశాలాంధ్ర - పెదపారుపూడి : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసనగా మండలంలోని కొర్నిపాడు గ్రామంలో "బాబుతో నేను" కార్యక్రమం టిడిపి పామర్రు నియోజకవర్గ ఇన్చార్జి వర్ల కుమార్ రాజా పిలుపుమేరకు ఆదివారం సాయంత్రం గం 4:00లకు ప్రారంభం అవుతున్నందున మండలంలోని టిడిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొని జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి, ప్రధాన కార్యదర్శి మసిముక్కు రాంబాబులు శనివారం ఒక ప్రకటనలో కోరారు.

అధినేతకు బాసటగా..మేము సైతం

విశాలాంధ్ర -పమిడిముక్కల: అక్టోబరు 14: చంద్రబాబు అక్రమ అరెస్ట్ పై మండలంలో పలుచోట్ల దీక్షలు, దేవాలయాల్లో పూజలు చేయిస్తూ తెలుగు తమ్ముళ్లు "బాబుతో నేను సైతం" తో పాటు జగన్ రెడ్డి చేస్తున్న అక్రమాలపై ఇంటింటికీ వెళ్ళి వివరిస్తున్నామని పామర్రు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి వర్ల కుమార రాజా తెలిపారు.శనివారం తాడంకి గ్రామంలో జగన్ అరాచకాలను, వైసిపి ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని కొద్ది నెలల్లో తెదేపా అధికారంలోకి రాగానే జనరంజకమైన పాలన అందిస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో తెలుగు దేశం పార్టీ సీనియర్ నేతలు జక్కా శ్రీనివాస రావు, మోటూరి వెంకట సుబ్బయ్య పలువురు తెదేపా నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మిక్‌లో ముగిసిన ఎలక్ట్రిక్ వెహికల్స్ కార్యాశాల

విశాలాంధ్ర- కంచికచర్ల: కంచికచర్ల మిక్ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో ఎలక్ట్రిక్ వెహికల్స్ అను అంశంపై మూడు రోజుల కార్యశాల నిర్వహించి నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి. వంశీ కిరణ్ తెలిపారు. కార్యక్రమానికి సైటెక్ హబ్ సంస్థ డైరెక్టర్ గోపాల్ రెడ్డి లక్కిరెడ్డి విచ్చేసి విద్యార్థులకు ఎలక్ట్రిక్ వాహన ప్రాముఖ్యత, పనిచేయు విధానం, వాహన విడి భాగాలు, వాహన మెయింటెనెన్స్ తదితర అంశాలపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ఎలక్ట్రిక్ వాహన భాగాలు పూర్తిగా విడదీసి వాహన పనితీరును విద్యార్థులకు విపులంగా వివరించారు. వాహనంలో ఉపయోగించే బ్యాటరీ దాని పనితీరు, ప్రమాదాల గురించి విద్యార్థులకు వివరించారు.

సభ్యుల అభ్యున్నతే ప్రాధాన్యతగా క్రెడిట్ సొసైటీ సేవలు

విశాలాంధ్ర-విజయవాడ: గత ఏడు దశాబ్దాలుగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టాఫ్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో ఆపరేటివ్ సొసైటీ అందిస్తున్న సేవలు సభ్యుల పురోగతిని లక్ష్యంగా చేసుకొని పనిచేస్తోందని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టాఫ్ యూనియన్ అమరావతి సర్కిల్ ప్రధాన కార్యదర్శి ఎల్. చంద్రశేఖర్ అన్నారు. సొసైటీ 69వ సర్వసభ్య సమావేశం ఆటోనగర్‌లోని ది ఆటోమొబైల్ టెక్నీషియన్స్ అసోసియేషన్ హాల్లో శనివారం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ బ్యాంకింగ్ రంగంలో వస్తున్న మార్పులు, ప్రభుత్వ రంగ బ్యాంకుల పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు, బ్యాంకు సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలపై సిబ్బంది సంఘాలు చేస్తున్న పోరాటాలు వంటి అంశాలపై ఉద్యోగులు అవగాహన కలిగి ఉండాలన్నారు. బ్యాంకింగ్ రంగంలో భవిష్యత్తులో రానున్న మార్పులపై సిబ్బంది తగిన సన్నద్ధత కలిగి ఉండాలని సూచించారు. ప్రధానంగా సొసైటీ అందిస్తున్న వివిధ రకాల సేవలను అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. సొసైటీలో చేసిన ప్రతి మార్పును సభ్యుల అభ్యున్నతిని దృష్టిలో పెట్టుకుని చేసామన్నారు. ఇప్పటివరకు అందిస్తున్న సేవలతోపాటు మరిన్ని సేవలు అందించేందుకు సొసైటీ తగిన ప్రణాళిక రూపొందించుకుంటోందని పేర్కొన్నారు. సొసైటీ విజయవాడ శాఖ అధ్యక్షులు ఎం. టీ.వీ. రమణ సొసైటీ వార్షిక ఆర్థిక నివేదికను సభ్యులకు గణాంకాలతో సహా వివరించారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటీ లో కార్యవర్గంలో వివిధ హోదాలలో బాధ్యతలను నిర్వహిస్తున్న పలువురు నాయకులతో సహా వీఎస్ఆర్. శేఖర్, వి. భాను ప్రసాద్, బీవీజీ శ్రీనివాస్, కేటీ చక్రవర్తి, వి. విజయ ప్రకాష్, ఎ. రవికుమార్, ఆర్ఎస్. ప్రభాకర్ తదితరులు పాల్గొన్న ఈ కార్యక్రమాన్ని సొసైటీ విజయవాడ మెట్రో ప్రాంతీయ కార్యదర్శి పి. బదరీ బాబు పర్యవేక్షించారు.

ఎస్సీ వర్గీకరణ ప్రయత్నాలను అడ్డుకోవడానికి త్వరలో చలో ఢిల్లీ

విశాలాంధ్ర,విజయవాడ (గాంధీనగర్) : ఎస్.సి.వర్గీకరణ ప్రయత్నాలను అడ్డుకో వడానికి త్వరలో చలో ఢిల్లీ చేడతామని పి.వి రావు మాల మహానాడు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు గుమ్మపు సూర్య వరప్రసాద్ రావు తెలిపారు. శనివారం గాంధీనగర్‌లో ఒక హోటల్‌లో ఆంధ్ర -తెలంగాణ రాష్ట్రాల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రంలో దళితులు మనగడా ప్రశ్నార్థికంగా మారిందని ఓట్లు వేసి అందలం మెక్కించిన దళితుల హక్కులు ఒక్కొక్కటి హరిస్తు ,ప్రశ్నించిన దళితులను చంపుకుంటూ పోతున్నారన్నారు. విశాఖలో డాక్టర్ సుధాకర్ మొదలుకొని కాకినాడలో దళిత డ్రైవర్ విది సుబ్రహ్మణ్యం వరకు చూస్తే అనేకమంది అసువులు బాసరని. హంతకులు మాత్రం దర్జాగా ముఖ్యమంత్రి జగన్ పక్కన అసెంబ్లీలోనూ కూర్చుంటున్నారని అగ్రహం వ్యక్తం చేశారు. 27 రకాల దళిత సంక్షేమ పథకాలను రద్దు చేశారని జగన్ బడుగు వికాసం ద్వారా వాహనాలు తీసుకున్న వారికి రెండు సంవత్సరాల సబ్సిడీ మంజూరు చేయలేదని లబ్ధిదారులు వాయిదాలు చెల్లించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని దళితులు పరిస్థితి ప్రశ్నార్థకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.జ ాతీయ అధ్యక్షులు పండు అశోక్ కుమార్ మాట్లాడుతూ భారత రత్న అంబేద్కర్ ఎంతో కృషిచేసి రాజ్యాంగం ద్వారా మనకు అందించిన హక్కులు నేడు ఒక్కొక్కటి దూరమవుతున్నాయన్నారు. .ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మళ్ళ నరసింహారావు,జాతీయ ఉపాధ్యక్షులు పెయ్యల పరశురాముడు ,పోతుల జ్ఞానయ్య, కోక్కిరిగడ్డ శ్యామ్ ,పంతగాని సురేష్, బాలకృష్ణ ,పెద్దిరాజు, సోమరాజు ,వీరస్వామి, నక్క శాస్త్రి, జల్లి శ్రీనివాస్, దాసరి త్రిమూర్తులు, రోకళ్ళ సూరిబాబు ,నూకరాజు,పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతుల రాష్ట్ర కన్వీనర్‌గా దివి నగరాయులు



విశాలాంధ్ర - అవనిగడ్డ : ఆంధ్రప్రదేశ్ కిసాన్ మోర్చ కౌలు రైతుల రాష్ట్ర కన్వినర్‌గా (నన్ను)కిసాన్ మోర్చ రాష్ట్ర అధ్యక్షులు కుమార్ స్వామి నియమించినట్లుగా నగరాయులు శనివారం విలేకరులకు తెలిపారు. రాష్ట్రంలోని కౌలు రైతులు ఎదుర్కొంటునటువంటి సమస్యలను రాష్ట్ర బి.జె.పి న్యాయకత్వం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం మరియు కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళడానికి శక్తి వంచన లేకుండా సేవలందిస్తూ కౌలు రైతులకు భారతీయ జనతాపార్టీ అండగా ఉంటుందని, ఆత్మవిశ్వాసం కలిగించడానికి విశేషమైన కార్యక్రమాలు రూపొందించి కౌలు రైతులకు ప్రభుత్వ సౌకర్యాలు అందే విధంగా కృషి చేస్తానని నగరాయులు అన్నారు. ఈ సందర్భంగా బి.జె.పి రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి , రాష్ట్ర మైనారిటీ మోర్చ అధ్యక్షులు షేక్ బాజీ, బి.జె.పి రాష్ట్ర కార్యదర్శి మట్టా ప్రసాద్‌లు అభినందనలు తెలిపారు. నియోజకవర్గంలోని రైతులు,బి.జె.పి నాయుకులతో పాటు పలువురు నగరాయులను అభినందించారు

రేపటి నుంచి కాకినాడకు ఆల్ట్రా డీలక్స్ సర్వీసు

విశాలాంధ్ర - అవనిగడ్డ : అవనిగడ్డ డిపో నుండి కాకినాడకు ఆల్ట్రా డీలక్స్ సర్వీసును నడిపినందుకు అనుమతి లభించిందని డిపో మేనేజర్ కె హనుమంతురావు శనివారం విలేకరులకు తెలిపారు. ఈ సర్వీసును 16 వ తేది సోమవారం నుండి నడిపేందుకు నిర్ణయించామని బస్సు అవనిగడ్డలో ప్రతిరోజు ఉదయం 6 గంటల 5 నిమిషాలకు బయలు దేవి మధ్యాహ్నం 1 గంట 15 నిమిషాలకు కాకినాడ చేరి తిరిగి కాకినాడలో మధ్యాహ్నం 2 గంటల 30 నిమిషాలకు బయలు దేరి రాత్రి 9 గంటల 40 నిమిషాలకు ఈ సర్వీసు అవనిగడ్డకు చేరుకుంటుందన్నారు. ఈ సర్వీసు అవనిగడ్డ నుండి మచిలీపట్నం, బంటుమిల్లి, క్రుత్తివెన్ను, పల్లెపాలెం, నరసాపురం, రాజోలు, అమలాపురం, యానాం మీదుగా కాకినాడ వెళ్ళి అదే రోజు తిరిగి రావడం జరుగుతుందన్నారు. కావున అవనిగడ్డ, రేపల్లె నియోజకవర్గాల మరియు మచిలీపట్నం ప్రాంత ప్రయాణికులు ఈ సర్వీసును వినియోగించుకోవాలని కోరారు. ఈ సర్వీసుకు రిజర్వేషన్ సౌకర్యం కూడా అందుబాటులో ఉందన్నారు.

పోరాటాన్ని నింపుకున్న యోధుడు జాలాది

విశాలాంధ్ర - అవనిగడ్డ : ప్రముఖ కవి, రచయిత్రి కీర్తి శేషులు జాలాది రాజారావు పోరాటా జలాన్ని తనలో నింపుకున్న యోధుడు అని పలువురు పేర్కొన్నారు. జాలాది వర్ధంతిని పురస్కరించుకుని మండల పార్టీ అధ్యక్షులు యాసం చిట్టిబాబు ఆధ్వర్యంలో శనివారం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో రాజారావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళ్ళు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పుణ్యభూమి నా దేశం నమో నమామి అంటూ దేశ భక్తిని చాటిన పొగిలి పొగిలి ఏడ్చిన పొంత నిండదు అంటూ జీవిత తత్వాన్ని చెప్పిన తనకు తానే సాటి అని ఋజువు చేసుకున్న మహా రచయిత రాజారావు అన్నారు. రాజారావు తండ్రి ఇమ్మానియేలు స్వాతంత్ర్య సమరంలో పోరాడుతున్న 14 సంవత్సరాల చిన్న వయస్సులోనే చదువుకుంటూనే తాను కూడా స్వాతంత్ర్య సమరయోధులకు కొరియర్‌గా పనిచేస్తూ పోరాట జలాన్ని నింపుకున్న యోధుడు జాలాది అని అటువంటి మహానీయుల వర్ధంతి జరుపుకుంటూ నివాళ్ళు అర్పించడం మన భాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో కూనపరెడ్డి చంద్రశేఖర్,మాజీ జడ్.పి.టి.సి కొల్లూరి వెంకటేశ్వరరావు, జిల్లా ఎస్.సి సెల్ నాయకులు ఎం. ఆదినారాయణ ఉన్నారు.

భక్తుల మన్ననలు పొందేలా విధులు

- పకడ్బందీగా దేవీ శరన్నవరాత్రులు
- భక్తులకు సౌకర్యవంతమైన దర్శనం
- సీపీ కాంతి రాణా

విశాలాంధ్ర-విజయవాడ (క్రైం): ఇంద్రకీలాద్రిపై ప్రతిష్ఠాత్మకంగా జరిగే దేవీ శరన్నవరాత్రులు నేటి నుంచి ప్రారంభంకానున్నాయి. ఈనెల 15వతేదీ నుంచి 23వతేదీ వరకు జరిగే దసరా ఉత్సవాల వేడుకలకు రాష్ట్రం నలుమూలల నుండే కాకుండా తెలంగాణా, కర్నాటక ప్రాంతాల నుండి అమ్మవారి దర్శనానికి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేస్తారు. ఈ నేపథ్యంలో నగరానికి విచ్చేసే భక్తులకు భద్రత దృష్ట్యా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా నగర పోలీస్ కమీషనర్ కాంతి రాణా టాటా ఆధ్వర్యంలో ప్రణాళికాబద్ధంగా పటిష్టమైన పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. దసరా బందోబస్తు సందర్భంగా వివిధ జిల్లాల నుండి విధులు నిర్వహించడానికి వచ్చిన సిబ్బంది అధికారులకు శనివారం లయోలా ఆడిటోరియం గ్రౌండ్స్‌లో సమావేశంలో నిర్వహించారు.సీపీ దసరా బందోబస్త్ విధులపై పలు మార్గదర్శకాలు, సూచనలు, సలహాలను చేశారు.ఈ సందర్భంగా సీపీ కాంతి రాణా మాట్లాడుతూ విజయవాడ తొమ్మిది రోజుల పాటు జరిగే దసరా వేడుకలకు ప్రత్యేక విశిష్టత, ప్రాధాన్యతలు ఉన్నాయని, దసరా ఉత్సవాలకు అధిక సంఖ్యలో భక్తులు నగరానికి విచ్చేసే అవకాశం ఉందన్నారు. ఈ క్రమంలో రోటీన్ బందోబస్త్ లాగా కాకుండా కొంత మనసు పెట్టి శ్రద్ధతో బందోబస్తు విధులు నిర్వహిస్తే భక్తుల మన్ననలతో పాటు అమ్మవారి ఆశీస్సులు ఉంటాయని తెలియజేశారు. యూనిఫాంలో విధులు నిర్వహించే సమయంలో ఇతరులు మనల్ని గమనిస్తుంటారనే విషయం గుర్తుంచుకోవాలని, బందోబస్తు నిర్వహించే సందర్భంలో పాటించాల్సిన మార్గ దర్శకాలు, విధి నిర్వహణలో వ్యవహరించే తీరును ప్రతి ఒక్క పోలీసు అధికారి, సిబ్బంది తెలుసుకోవాలన్నారు. మూడు షిఫ్టుల్లో బందోబస్తు విధులు నిర్వహించే ఏర్పాట్లు చేయడం జరిగింది. కాబట్టి మరింత సమర్థవంతంగా బందోబస్తు విధులు నిర్వహించాలన్నారు. ముఖ్యంగా ఆలయ అర్చకులు, ఆలయ సిబ్బంది ఇతర శాఖల సిబ్బంది, వి.ఐ.పి.లతో వివాదాలకు తావులేకుండా సమన్వయం చేసుకోవాలని సూచించారు. బందోబస్తుల్లో సమన్వయంతో వ్యవహరిస్తే అమ్మవారి దర్శనం సజావుగా సాగుతుందన్నారు. అలాగే దర్శనానికి విచ్చేసే సాధారణ భక్తులకు మొదటిగా ప్రాధాన్యత ఇచ్చి అధికారుల నుండి క్రింది స్థాయి సిబ్బంది వరకు ప్రతి ఒక్కరూ కూడా వారితో మర్యాధగా వ్యవహరిస్తూ సక్రమంగా అమ్మవారి దర్శనం అయ్యేలా చూడాలని, అదే సమయంలో క్యూలైన్లలో ఏవిధమైన సంఘటనలకు ఆస్కారం లేకుండా క్యూలైన్లలో భక్తులు సక్రమంగా కదిలేలా కృషి చేయాలన్నారు చెప్పారు. బందోబస్తు సందర్భంగా నిర్దేశించిన ప్రదేశంలో విధులు నిర్వహించడంతో పాటు రిలీవర్ వచ్చే వరకు పాయింటు వదలి వెళ్ళకూడదని సిబ్బందికి తెలియజేశారు. అలాగే సిబ్బందికి ఏవైనా అనుమానాలు లేదా సమస్యలు ఉంటే సంబంధిత సెక్టార్ ఇన్‌ఛార్జ్ కు లేదా పోలీసు ఉన్నతాధికారుల వారి దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ సమావేశంలో డీసీపీ విశాల్ గున్ని , ఏఐజీ ఎం.రవీంద్ర బాబు, డీసీపీ అజిత వెజెండ్ల, సి. ఎస్. డబ్ల్యూ డీసీపీ ఉదయరాణి అడ్మిన్ డీసీపీ మోకా సత్తిబాబు, క్రైమ్ ఏడీసీపీ పి.వెంకట రత్నం గారు, ఎస్.బి. ఏడీసీపీ సి.హెచ్.లక్ష్మీపతి, ట్రాఫిక్ ఏడీసీపీ డి.ప్రసాద్, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, బందోబస్తు విధులకు హాజరైన సుమారు 6044 మంది పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.